ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -337 పేజీలు - 08 వెల - 04/- శనివారం 1 నవంబర్ 2025

# దేశ ఐక్యత, సమగ్రతను కాపాడతా





**ఐక్యతా ప్రతిజ్ఞ చేసిన ప్రధాని మోదీ**

**సర్దార్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవం**

**గుజరాత్‌లోని స్టాట్యూ ఆఫ్ యూనిటీ వద్ద పటేల్‌కు ప్రధాని మోదీ నివాళి**

**అక్టోబర్ 31ఆంధ్ర ప్రగతి**
సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని (రాష్ట్రీయ ఏక్తా దివస్) ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీమిగతాది 2లో...

# పార్టీ లైన్ దాటితే సహించేది లేదు

**పార్టీ క్రమశిక్షణ సంఘాలనికి**

**ఎంపీ,ఎమ్మెల్యే వివాదం**

**పార్టీ నేతలతో సమావేశంలో**

**చంద్రబాబు వెల్లడి**

**నేడు లండన్‌కు బయలుదేరనున్న**

**బాబు దంపతులు**



అమరావతి,**అక్టోబర్ 31ఆంధ్ర ప్రగతి** పార్టీ లైన్ ఎవరూ దాటినా సహించేది లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. టీడీపీ తిరువూరు విభేదాలకి కారణమైన ఇరువురు నేతలు ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపుడి శ్రీనివాసరావులతో తాను కూడా మాట్లాడుతానని స్పష్టం చేశారు. టిడీపీ నేతలకి సంబంధించిన తిరువూరు విభేదాలపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత కూడా పరిస్థితి చక్కబడకపోతే చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ ఈ విషయాన్ని ఇరువురు నేతలకి చెప్పాలని సూచించారు. శుక్రవారం టీడీపీ నేతలతో చంద్రబాబు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పార్టీకి సంబంధించిన పలు కీలక అంశాలపై అధినేత చర్చించారు. అనంతరం పార్టీ నేతలతో తిరువూరు విభేదాల గురించి మాట్లాడారు.

ఈ నేపథ్యంలో తిరువూరు వివాదాన్ని పార్టీ క్రమశిక్షణ కమిటీకి అప్పగించారు సీఎం చంద్రబాబు.

ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపుడి శ్రీనివాసరావులని

## మొంథా తుపాన్‌తో

**రూ.5,244 కోట్ల మేర నష్టం**

**కేంద్రానికి రాష్ట్రప్రభుత్వం నివేదిక**



అమరావతి,**అక్టోబర్ 31ఆంధ్ర ప్రగతి**ఏపీలో 'మొంథా' తుపాను బీభత్సంతో వాటిల్లిన నష్టంపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక నివేదిక అందించింది. మొత్తం రూ.5,244 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు వెల్లడించింది. తుపాను ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు కేంద్ర బృందాలను పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి తక్షణ సాయం చేయాలని కోరారు. 249 మండలాల పరిధిలో 1,434 గ్రామాలు, 48 పట్టణాలపై తుపాను ప్రభావం పడినట్లు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.

## ఎన్టీఆర్ వైద్యసేవలు పునరుద్ధరణ

**మంత్రి సత్యకుమార్‌తో చర్చలు సఫలం**

**తక్షణం 250 కోట్లు విడుదలకు అంగీకారం**

అమరావతి,**అక్టోబర్ 31ఆంధ్ర ప్రగతి**
ప్రైవేటు ఆస్పత్రుల అసోసియేషన్‌తో ఏపీ ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఆందోళన విరమించిన యాజమాన్యాలు.. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్యసేవల పునరుద్ధరణకు అంగీకారం తెలిపాయి. వెంటనే మరో రూ.250 కోట్ల బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం అంగీకరించింది. ప్రైవేటు ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులతో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం సమావేశమయ్యారు. నవంబర్ చివరికల్లా పెండింగ్ బకాయిలు మొత్తం ఒకే విడతలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. బకాయిల చెల్లింపుపై మంత్రి స్పష్టమైన హామీ ఇవ్వడంతో వైద్యసేవల పునరుద్ధరణకు యాజమాన్యాలు అంగీకరించాయి. .మిగతాది 2లో...




## తుఫాన్ బాధితులందరికీ తక్షణ సాయం

**అధికారులకు పవన్ ఆదేశం**



## భౌతికంగా హాజరుకావాల్సిందే

**వీధి కుక్కల కేసు: రాష్ట్రాల సీఎస్‌లపై సుప్రీంకోర్టు ఆగ్రహం..**

**నవంబర్ 3న భౌతికంగా హాజరు కావాలని కఠిన ఆదేశాలు**

**వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలన్న విజ్ఞప్తి తిరస్కరణ**




2లో.



## మంత్రిగా అజారుద్దీన్

**రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్**

**సిఎం రేవంత్ , మంత్రులు తదితరుల హాజరు**

హైదరాబాద్,**అక్టోబర్ 31ఆంధ్ర ప్రగతి**
తెలంగాణ మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పాల్గొన్నారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అజారుద్దీన్‌తో ప్రమాణం చేశారు. అల్లా సాక్షిగా ఇంగ్లీషులో ఆయన ప్రమాణం చేశారు. అంతరం గవర్న్, సిఎంలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలియచేశారు. మధ్యాహ్నం 12.15గంటల ప్రాంతంలో ప్రమాణ స్వీకారం చేయించారు. కేబినెట్ విస్తరణలో భాగంగా ఆయన ఒక్కరే మంత్రిగా ప్రమాణం చేశారు.మిగతాది 2లో...



## బాధితురాలినే పెళ్లాడిన దోషికి శిక్ష రద్దు!

**పోక్సో కేసులో సుప్రీంకోర్టు సంచలన తీర్పు...**

**దోషికి పడిన పదేళ్ల శిక్షను రద్దు చేసిన సుప్రీంకోర్టు**

**రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద అసాధారణ అధికారాలను వినియోగించిన ధర్మాసనం**



2లో.

## ఆ సంప్రదాయాన్ని బీఆర్ఎస్ తుంగలో తొక్కింది

**: జూబ్లీహిల్స్‌లో రేవంత్ రెడ్డి ప్రచారం**

**చనిపోతే పోటీలో నిలబెట్టవద్దనే**

**పీజేఆర్ చనిపోతే బీఆర్ఎస్ అభ్యర్థిని నిలబెట్టిందని ఆగ్రహం**



హైదరాబాద్**అక్టోబర్ 31ఆంధ్ర ప్రగతి**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వెంగళరావు నగర్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ తరపున ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎవరైనా మరణిస్తే వారి స్థానంలో పోటీ పెట్టకూడదనే సంప్రదాయాన్ని బీఆర్ఎస్ పార్టీ తుంగలో తొక్కిందని ఆరోపించారు.మిగతాది 2లో...

# దేశ ఐక్యత, సమగ్రతను కాపాడతా

**(మొదటి పేజీ తరువాయి)**

గుజరాత్‌లోని ఏక్తా నగర్‌లో నర్మదా నది ఒడ్డున ఉన్న 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' వద్ద సర్దార్ పటేల్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన భారీ పరేడ్, సాంస్కృతిక ప్రదర్శనలు దేశ భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'ఏక్తా శపథ్' (ఐక్యతా ప్రతిజ్ఞ) చేశారు. "దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటానికి నా జీవితాన్ని అంకితం చేస్తానని ఈ రోజు ప్రతిజ్ఞ చేస్తున్నాను. జాతీయ ఐక్యతా స్ఫూర్తితో ఈ ప్రమాణం స్వీకరిస్తున్నాను. దేశ అంతర్గత భద్రతను కాపాడేందుకు కట్టుబడి ఉంటాను" అని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు ఈరోజు ఉదయం 8 గంటల ప్రాంతంలో ప్రధాని మోదీ పటేల్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అక్కడ నిర్వహించిన 'రాష్ట్రీయ ఏక్తా దివస్ పరేడ్'ను వీక్షించారు. ఈ పరేడ్‌లో బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ సహా వివిధ రాష్ట్రాల పోలీస్ బలగాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ప్రధాని 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పటేల్‌కు నివాళులర్పించారు. "సర్దార్ పటేల్ 150వ జయంతి సందర్భంగా భారత్ ఆయనకు నివాళులర్పిస్తోంది. దేశాన్ని ఏకీకరణ చేయడంలో ఆయన కీలక శక్తిగా నిలిచారు. జాతీయ సమగ్రత, సుపరిపాలన, ప్రజాసేవ పట్ల ఆయనకున్న నిబద్ధత ఎన్నో తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది" అని మోదీ పేర్కొన్నారు. అనంతరం విడుదల చేసిన వీడియో సందేశంలో భారతదేశ ఏకీకరణ శిల్పిగా పటేల్‌ను అభివర్ణించారు. "భావజాల విభేదాలు ఉన్నవారితో కూడా కలిసి పనిచేసి, ప్రజలను ఏకం చేయడంలో సర్దార్ పటేల్‌కు సాటిలేని సామర్థ్యం ఉంది. ఆయన ప్రతి చిన్న విషయాన్ని గమనించి, దేశ ఐక్యత కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను భాగస్వాములను చేసి, సంస్థానాలను దేశంలో విలీనం చేసి, భిన్నత్వంలో ఏకత్వం అనే మంత్రాన్ని భారతీయులలో మేల్కొల్పారు" అని ప్రధాని వివరించారు. భారతదేశ ఐక్యత, సమగ్రత, భద్రతను పెంపొందించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న సర్దార్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే.

# మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణం

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు హాజరయ్యారు. నూతన మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకీ ఏ శాఖను కేటాయిస్తారు అనే అంశంపై క్లారిటీ లేదు. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరిగింది. రాష్ట్రమంత్రి వర్గ విస్తరణకు ఇటీవల ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. అయితే, ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజాహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఎప్పుడు కేబినెట్ ఏర్పడినా.. ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి కేబినెట్‌లో అవకాశం కల్పించేందుకు సాధ్యపడలేదు. కాగా.. అజాహరుద్దీన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎమ్మెల్సీ నియామక ప్రక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపింది. 1963 ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లో అజారుద్దీన్ జన్మించారు. అబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించారు. నిజాం కాలేజీలో బీకాం చదివారు. మేనమామ జైనులాబుద్దీన్ స్ఫూర్తితో క్రికెట్ వైపు అడుగులు వేశారు. 1984లో అంతర్జాతీయ క్రికెట్‌లో రంగప్రవేశం చేశారు. అజారుద్దీన్ క్రికెటర్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తొలి మూడు టెస్టుల్లోనూ సెంచరీలతో సంచలనం సృష్టించారు. 1989లో భారత క్రికెట్ జట్టు కెప్టెన్‌గా భాధ్యతలు చేపట్టారు. 16 ఏళ్ల క్రికెట్ కెరీర్‌లో 99 టెస్టులు, 334 వన్డేలు ఆడారు. రిటైర్మెంట్ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. 2009 ఫిబ్రవరి 19న కాంగ్రెస్‌పార్టీలో చేరారు. అదే సంవత్సరం యూపీలోని మొరాదాబాద్ స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2018లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అజారుద్దీన్‌ను నియమించారు.

# ఎన్టీఆర్ వైద్యసేవలు పునరుద్ధరణ

**(మొదటి పేజీ తరువాయి)**

బకాయిలు చెల్లించాలన్న డిమాండ్‌తో గత 20 రోజులుగా ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులు సమ్మె చేస్తున్నాయి. ప్రభుత్వం ప్రాథమికంగా రూ.250 కోట్ల బకాయిలు విడుదల చేసింది. దశల వారీగా మిగిలిన బకాయిలూ చెల్లిస్తామని ప్రకటించింది. అయినా సమ్మె కొనసాగించడంతో మొత్తం బకాయిలు వన్ టైం సెటిల్‌మెంట్ కింద నవంబర్ చివరికల్లా చెల్లించాలని నిర్ణయించింది. మొత్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల అసోషియేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఈ క్రమంలో సమ్మె విరమించాలని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కింద ఉన్న స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ నిర్ణయించింది. వైద్య సేవా పథకం కింద సేవలన్నింటినీ పున:ప్రారంభించాలని నిర్ణయించినట్లు అసోసియేషన్ ప్రకటించింది. నవంబర్ 15లోపు 250 కోట్ల రూపాయలు విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని అసోషియేషన్ వెల్లడించింది. అన్ని బకాయిల పరిష్కారానికి ఒకేసారి సెటిల్‌మెంట్ విధానానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని పేర్కొంది. ఈ నిర్ణయాలు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయని అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు

ఏపీ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ ప్రకటనను విడుదల చేసింది. తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన సీఎం చంద్రబాబు, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ట్రస్ట్ వైస్ ఛైర్మన్ సుధాకర్, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి, వైద్య సేవ ట్రస్ట్ సీఈవోకు అసోసియేషన్ కృతజ్ఞతలు తెలియజేసింది.

# పార్టీ లైన్ దాటితే సహించేది లేదు

**(మొదటి పేజీ తరువాయి)**

పిలిపించి మాట్లాడాలని ఆదేశాలు జారీ చేశారు. ఇరువురు అభిప్రాయాలను ఓ లేఖ రూపంలో తనకు ఇవ్వాలని ఆదేశించారు. తాను లండన్ పర్యటన నుంచి వచ్చిన తర్వాత ఇరువురిని పిలిపించి మాట్లాడుతానని అధినేత స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వైసీపీ నెగెటివ్, ఫేక్ ప్రచారం చేస్తోందని చంద్రబాబు దృష్టికి పార్టీ నేతలు తీసుకువచ్చారు. ఈ విషయంపై నిజాలు ఏమిటో ప్రజలకు టీడీపీ శ్రేణులు వివరించాలని చెప్పారు. అవసరమైతే సోషల్ మీడియాలో ఈ విషయంలో అవగాహన ఉన్నవారిని తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. అయితే, వచ్చే వారం తర్వాత నుంచి వారంలో ఒకరోజు మొత్తం టీడీపీ కేంద్ర కార్యాలయంలోనే ఉండాలని నిర్ణయం తీసుకున్నారు సీఎం చంద్రబాబు. కొంతమంది టీడీపీ ఎమ్మెల్యేలు సీఎంఆర్ఎఫ్ లేఖలు ఇవ్వడం లేదని సీఎంకు పార్టీ కేంద్ర కార్యాలయం సిబ్బంది చెప్పారు. ఆ ఎమ్మెల్యేలు ఎవరో తనకు వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు సీఎం. అంత సమయం లేకుండా ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆ ఎమ్మెల్యేల జాబితా తయారు చేసి తనకు టెలికాన్ఫరెన్స్‌లో అందరిని కలపాలని ఆజ్ఞాపించారు. తన లండన్ పర్యటన ముగించుకొని వచ్చిన వెంటనే టీడీపీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కమిటీలను నియమిస్తామని చెప్పుకొచ్చారు. జాబితాలు సిద్ధంగా ఉన్నాయని, వాటిని తీసుకొని రావాలని టీడీపీ ఏపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంపై తాను ఒక గంట సమయం కేటాయిస్తే చాలని చెప్పుకొచ్చారు. మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలకు ఎమ్మెల్యేలు నవంబరు 2వ తేదీన మళ్లీ వెళ్లాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

# తుఫాన్ బాధితులందరికీ తక్షణ సాయం

## అధికారులకు పవన్ ఆదేశం




అమరావతి,**అక్టోబర్ 31 (గుడివాడ మెయిల్):** మొంథా తుఫానుతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని అధికారులకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. కాకినాడ జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో ఏపీ సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పవన్ కల్యాణ్ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుఫాను అనంతర ఉపశమన చర్యలపై అధికారులకి కీలక ఆదేశాలు జారీ చేశారు డిప్యూటీ సీఎం. కాకినాడ జిల్లా పరిధిలో పంట నష్టం, ఆస్తి నష్టం అంచనాలని పకడ్బందీగా రూపొందించాలని మార్గనిర్దేశర చేశారు. అలాగే, పిఠాపురం నియోజకవర్గంలో వరద ప్రభావిత పరిస్థితిపై ఆరా తీశారు పవన్ కల్యాణ్. కాకినాడ జిల్లా తీర ప్రాంత గ్రామాల రక్షణపై బృహత్ ప్రణాళిక రచించాలని సూచించారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకీ న్యాయం జరగాలని ఆదేశించారు. ఏలేరు కాలువ గట్టు పటిష్టతకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆజ్ఞాపించారు. మల్లవరం పత్తి రైతులకు న్యాయం చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు.

# ప్రపంచ పర్యాటక కేంద్రంగా ఎపి

## 4నుంచి 6 వరకు లండన్ పర్యటన

## -రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి




అమరావతి,**అక్టోబర్ 31ఆంధ్ర ప్రగతి** ప్రపంచ పర్యాటక యవనికపై ఏపీని నిలబెడుతామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ వ్యాఖ్యానించారు. నవంబరు 4వ తేదీ నుంచి 6 వ తేదీ వరకు లండన్ లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 2వ తేదీన లండన్ పర్యటనకు బయలు దేరుతున్నట్లు చెప్పుకొచ్చారు. వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యూటీఎం)-2025 ప్రదర్శనలో పాల్గొంటున్నట్లు వివరించారు. లండన్ పర్యటనలో 30 మంది విదేశీ ప్రతినిధులతో ఏపీ పర్యాటక రంగ అభివృద్ధిపై చర్చలు జరుపుతామని వెల్లడించారు మంత్రి కందుల దుర్గేష్. శుక్రవారం మీడియాతో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడారు. ఏపీని ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా విదేశీ పర్యటన ఉంటుందని పేర్కొన్నారు. డబ్ల్యూటీఎం వేదికగా ఏపీ స్టాల్‌ను ఏర్పాటు చేసి రాష్ట్ర పర్యాటక ప్రదేశాలకు ప్రాచుర్యం కల్పిస్తామని తెలిపారు. లండన్ పర్యటనలో భాగంగా పలు దేశాల్లో పర్యాటక రంగం ఎలా అభివృద్ధి చెందుతున్నదో అధ్యయనం చేస్తామనిపేర్కొన్నారు మంత్రి కందుల దుర్గేష్. ఎపీ పర్యాటకానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. ఏపీకి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పర్యాటకులు పెద్ద సంఖ్యలో రాష్ట్రానికి తరలి వచ్చేందుకు కృషి చేస్తామని వివరించారు. ఏపీ పర్యాటక రంగాన్ని విశ్వవ్యాప్తం చేయడం వల్ల విదేశీ పర్యాటకుల తాకిడి పెరిగి పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని ఉద్ఘాటించారు. తద్వారా ఏపీలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సైతం పెరుగుతాయని భావిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

# క్యాబినేట్ హోదాతో సలహాదారులు

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయనకు ఆరు గ్యారంటీల అమలు బాధ్యతలు అప్పగించింది. కేబినెట్ విస్తరణలో చోటు దక్కకపోవడంతో నిరాశ చెందిన సుదర్శన్ రెడ్డికి ఇప్పుడు కీలకమైన బాధ్యత లభించడం, పార్టీ అంతర్గత రాజకీయాల్లో సమతుల్యత సాధించే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు. మంత్రి పదవి ఆశించిన మరో సీనియర్ నేత, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును సివిల్ సప్లై కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. మొత్తానికి, బుజ్జగింపు చర్యలు సఫలీ కృతమైనట్లు కాంగ్రెస్ భావిస్తోంది. నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అభి వృద్ధి కార్యక్రమాల అమలు సలహాదారుడిగా నియమిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. సుదర్శన్ రెడ్డి కేబినెట్ సమావేశాలకు కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు. మంత్రుల నివాస ప్రాంగణంలో ఆయన క్వార్టర్ కేటాయించాలని కూడా ఆదేశాలు జారీ అయ్యాయి. అదే విధంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కొరాల ప్రేమ్ సాగర్ రావుకు పౌరసర ఫరాల కార్పొరేషన్ చైర్మన్ పదవిని ప్రభుత్వం అప్పగించింది. ఆయనకు కూడా కేబినెట్ హోదా కల్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

# అమెరికా-భారత్ మధ్య రక్షణ ఒప్పందం

**ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశంపదేళ్ల పాటు ఉండే ఒప్పందంపై సంతకం**

**రాజ్‌నాథ్‌తో భేటీ కావడం సంతోషంగా ఉందన్న అమెరికా రక్షణ మంత్రి**

**అక్టోబర్ 31ఆంధ్ర ప్రగతి**

అమెరికా, భారత దేశాల మధ్య కీలక రక్షణ ఒప్పందం కుదిరింది. మలేషియాలో ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌లు సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక, భద్రత సహకారాన్ని పెంపొందించేందుకు ఉద్దేశించిన ఈ ఒప్పందం పదేళ్ల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా హెగ్సెత్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా స్పందిస్తూ, పదేళ్ల రక్షణ ఒప్పందంపై సంతకం చేయడానికి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశం కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఇది ఇరు దేశాల రక్షణ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకువెళుతుందని ఆయన అన్నారు. సమన్వయం, సమాచారంతో పాటు సహకారాన్ని మరింతగా పెంచుకుంటామని, తమ రక్షణ సంబంధాలు మరింత బలంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

# భౌతికంగా హాజరుకావాల్సిందే

**వీధి కుక్కల కేసు: రాష్ట్రాల సీఎస్‌లపై సుప్రీంకోర్టు ఆగ్రహం..**

**అక్టోబర్ 31ఆంధ్ర ప్రగతి**

వీధి కుక్కల నియంత్రణ కేసులో పలు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల (సీఎస్‌లు) తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను పాటించని సీఎస్‌లు నవంబర్ 3న జరిగే విచారణకు భౌతికంగా హాజరు కావాల్సిందేనని స్పష్టం చేసింది. వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ కేసుకు సంబంధించి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా శుక్రవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. సదరు సీఎస్‌లను వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలని కోరారు. దీనిపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. "కంప్లయన్స్ అఫిడవిట్ దాఖలు చేయమని మేము ఆదేశిస్తే, వాళ్లు నిద్రపోతున్నారు. కోర్టు ఆదేశాల పట్ల ఏమాత్రం గౌరవం లేదు. సరే, అయితే వాళ్లనే రానివ్వండి" అని జస్టిస్ విక్రమ్ నాథ్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

వీధి కుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల మేరకు కంప్లయన్స్ అఫిడవిట్లు దాఖలు చేయనందున, పశ్చిమ బెంగాల్, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాల సీఎస్‌లు నవంబర్ 3న తమ ముందు హాజరు కావాలని సుప్రీంకోర్టు అక్టోబర్ 27న ఆదేశించిన విషయం తెలిసిందే. ఆగస్టు 22న సుప్రీంకోర్టు ఈ కేసు పరిధిని ఢిల్లీ-ఎన్‌సీఆర్ నుంచి దేశవ్యాప్తంగా విస్తరించింది. జంతు జనన నియంత్రణ (ఏబీసీ) నిబంధనల అమలుకు అవసరమైన వనరుల (డాగ్ పౌండ్స్, పశువైద్యులు, కుక్కలను పట్టే సిబ్బంది, వాహనాలు, బోనులు) పూర్తి గణాంకాలతో అఫిడవిట్లు దాఖలు చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మున్సిపల్ అధికారులను ఆదేశించింది. ఏబీసీ నిబంధనలు దేశమంతటా ఒకేలా వర్తిస్తాయని పేర్కొంటూ రాష్ట్రాలను ఈ కేసులో ప్రతివాదులుగా చేర్చింది. ఢిల్లీలో వీధి కుక్కల కాటు వల్ల చిన్నారులు రేబిస్ బారిన పడుతున్నారంటూ వచ్చిన మీడియా కథనాల ఆధారంగా సుప్రీంకోర్టు జూలై 28న ఈ కేసును సుమోటోగా స్వీకరించి విచారణ జరుపుతోంది.

# ఆ సంప్రదాయాన్ని బీఆర్ఎస్ తుంగలో తొక్కింది

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీని ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని ఆయన అన్నారు. గతంలో పీజేఆర్ మరణించినప్పుడు బీఆర్ఎస్ దుర్మార్గంగా వారి అభ్యర్థిని నిలబెట్టిందని మండిపడ్డారు. నగరానికి గోదావరి నీళ్లు తెచ్చిన ఘనత పీజేఆర్‌దేనని కొనియాడారు. అలాంటి పీజేఆర్‌పై పోటీకి దింపిన బీఆర్ఎస్‌కు సానుభూతి ఓట్లు అడిగే హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంటోన్మెంట్‌లో కూడా సెంటిమెంట్‌ను నమ్ముకున్నారని ఆరోపించారు.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధమని ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసి బీజేపీని గెలిపించిందని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా ఈ ప్రాంతానికి వచ్చారా అని నిలదీశారు. ఓట్ల కోసం బీఆర్ఎస్ నాయకులు వస్తే వారికి వాతలు పెట్టాలని ఓటర్లకు సూచించారు. నవీన్‌ను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని హామీ ఇచ్చారు.

# హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి పేదలను రోడ్డుపాలు చేస్తున్నారు

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ క్రమంలో కేటీఆర్ షేక్‌పేట డివిజన్‌లో ప్రచారం చేశారు. ఓయూ కాలనీ మీదుగా వినోభానగర్ వరకు రోడ్డు షో కొనసాగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, హిట్లర్ నశించడాన్ని చూశామని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నాళ్లు ఉంటుందో చూస్తామని అన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటమి తప్పదని, ఒకవేళ ఓటమి ఎదురైతే ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు నిలబడదని అన్నారు. ఇందిరమ్మ రాజ్యమంటే హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లు కూల్చడమా అని ప్రశ్నించారు. ఒకప్పుడు ఇందిరమ్మ పేదరికాన్ని నిర్మూలించాలని నినదిస్తే, ఇప్పుడు రేవంత్ రెడ్డి పేదోళ్లను రోడ్డున పడేస్తున్నారని విమర్శించారు.

మాగంటి సునీత మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ఒక కుటుంబమని గోపీనాథ్ చెప్పేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన మహిళలకు అండగా ఉంటూ సమస్యలు పరిష్కరించేవారని అన్నారు. కష్ట సమయాల్లో ప్రజలకు అండగా నిలబడ్డారని తెలిపారు. ఎవరికీ భయపడవద్దని, ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు

# మైనారిటీలకు ఉచిత 'టెట్" కోచింగ్.

**ఆన్ లైన్, ఆఫ్ లైన్ కోచింగ్ కు ఏర్పాట్లు. -మైనారిటీ యువత సద్వినియోగం చేసుకోవాలి.**

**రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**



**ఆంధ్ర ప్రగతి అమరావతి అక్టోబరు 31:** రాష్ట్ర విద్యా శాఖ నిర్వహించబోయే టెట్ పరీక్షకు హాజరయ్యే మైనారిటీ యువతకు ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ శుక్రవారం అమరావతిలో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.ఏపీ ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ అఫ్ మైనారిటీస్ (సిఈడియం) ద్వారా మైనారిటీలకు ఉచిత కోచింగ్ అందించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. విద్యా శాఖ ఈ ఏడాది డిసెంబర్ 10 న టెట్ పరీక్ష నిర్వహిస్తుందన్నారు.టెట్ పరీక్షలకు నవంబర్ మొదటి వారం చివరి నుండి మైనారిటీ యువతకు ఉచితంగా కోచింగ్ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.టెట్ పరీక్ష కోసం కోచింగ్ ను ఆన్ లైన్ తో పాటు ఆఫ్ లైన్ ద్వారా అందిస్తామని తెలిపారు.కూటమి ప్రభుత్వం చేపట్టిన ఈ అవకాశాన్ని మైనారిటీ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ కోరారు.పూర్తి వివరాల కోసం సిఈడియం వెబ్ సైట్ **www.apcedmmwd.org** ద్వారా టెట్ పరీక్షకు సన్నద్ధమయ్యే మైనారిటీ యువత తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం సిఈడియం కార్యాలయం, భవానీపురం, విజయవాడ - 5200012 కు లేదాఫోన్ నంబర్లు 0866-29705677386789966 కు సంప్రదించవచ్చని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతికి నివాళి.

**ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి.**

**నివాళులర్పించిన కళారాధన, లయన్స్ క్లబ్, దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు.**

**స్వాతంత్ర్యం తర్వాత భారతదేశాన్ని పటిష్ట పరిచిన మహెూన్నతుడు సర్దార్ వల్లభాయ్ పటేల్: డాక్టర్ రవి కృష్ణ.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 31:**
శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ ప్రథమ హెూం శాఖ మంత్రి, ఉక్కుమనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి సందర్భంగా స్థానిక కళారాధన,జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో కళారాధన, లయన్స్ క్లబ్, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళారాధన ప్రధాన కార్యదర్శి,జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ సర్దార్ పటేల్ స్వాతంత్ర్యం తర్వాత 500 కు పైగా స్వతంత్ర సంస్థానాలను, నైజాం ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం చేసి దేశాన్ని పటిష్టపరిచిన మహెూన్నతుడని కొనియాడారు. బార్డోలి సత్యాగ్రహానికి నాయకత్వం వహించి, మహాత్మా గాంధీ ముఖ్య అనుచరుడిగా దేశ స్వాతంత్ర పోరాటంలో కీలక పాత్ర వహించిన మహనీయుడు అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సర్దార్ పటేల్ స్ఫూర్తిని భావితరాలకు అందించాలనే సంకల్పంతో సర్దార్ సరోవర్ ప్రాజెక్టు సమీపంలో సర్దార్ పటేల్ భారీ విగ్రహాన్ని సమైక్యతకు ప్రతీకగా నిర్మించి సర్దార్ వల్లభాయ్ పటేల్ జ్ఞాపకాలు చిరస్మరణీయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.పీ.వి. రమణయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, కళారాధన కార్యవర్గ సభ్యులు శివరామిరెడ్డి, దివ్యాంగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు రంగస్వామి,లయన్స్ క్లబ్ సభ్యులు రామయ్య, వెంకటరమణ, కార్యాలయ కార్యదర్శి మధు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాలలో భారత హాకీ శతాబ్ది ఉత్సవాలు.!

**నవంబర్ 7వ తేదీ ఎస్పీజీ స్కూలు మైదానంలో. - నంద్యాల కు చెందిన హాకీ వెటరన్ క్రీడాకారులకు సత్కారం.**

**భారత హాకీ చరిత్ర- ధ్యాన్ చంద్ ప్రాముఖ్యత" అంశంపై 4 వ తేది తెలుగులో వ్యాసరచన,6 వ తేదీన ఆంగ్లంలో వక్తృత్వ పోటీలు.**

**గిన్నిస్ బుక్ రికార్డు దిశలో ఏడవ తేదీ దేశవ్యాప్తంగా నంద్యాల తో సహా 1000 మైదానాలలో హాకీ మ్యాచ్ ల నిర్వహణ.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 31:**
భారత జాతీయ హాకీ శతాబ్ది ఉత్సవాలు పురస్కరించుకుని నంద్యాలలో ఎస్ పి జి స్కూలు మైదానంలో నవంబర్ 7వ తేదీ నంద్యాల హాకీ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక క్రీడా సమాఖ్య కార్యాలయంలో నంద్యాల హాకీ సంఘం నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు చాణిక్యరాజు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ నవంబర్ 7వ తేదీ నిర్వహించే కార్యక్రమాలు వివరించారు. భారత హాకీ శతాబ్ది ఉత్సవాల నిర్వహణలో భాగంగా గిన్నిస్ బుక్ రికార్డుల్లో నమోదు కోసం దేశవ్యాప్తంగా నవంబర్ 7వ తేదీ వెయ్యి హాకీ మ్యాచ్ లు నిర్వహిస్తున్నారని, నంద్యాలలో కూడా ఆరోజు హాకీ మ్యాచ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే రోజు నంద్యాల నుండి హాకీలో రాష్ట్ర ,జాతీయ స్థాయిలో పాల్గొన్న పూర్వ క్రీడాకారులను సత్కరించడం జరుగుతుందన్నారు.
ఈ ఉత్సవాలలో భాగంగా నంద్యాల లో ఉన్న హైస్కూల్ పాఠశాల విద్యార్థులకు "భారత హాకీ చరిత్ర - హాకీ



మాంత్రికుడు ధ్యాన్ చంద్ ప్రాముఖ్యత " అంశంపై 4 వ తేదీ తెలుగులో వ్యాసరచన పోటీలు, ఆరవ తేదీ అదే అంశంపై ఆంగ్లంలో వక్తృత్వ పోటీలు స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతలకు ఏడవ తేదీ ఎస్పీజీ మైదానంలో జరిగే ఉత్సవంలో బహుమతి ప్రధానం చేస్తామన్నారు. భారతదేశం హాకీలో 1928 నుండి 1964 వరకు వరుసగా ఏడుసార్లు ఒలింపిక్స్ లో బంగారు పతకం సాధించిందని తిరిగి 1980లో మరొకసారి బంగారు పతకం సాధించడం జరిగిందని గుర్తు చేశారు. అదేవిధంగా ఒకసారి రజత పతకం నాలుగు సార్లు కాంస్య పతకాలు భారతదేశ ఒలింపిక్స్ లో సాధించిందని వివరించారు.
విద్యార్థులలో,యువతలో జాతీయ క్రీడ అయిన హాకీ పై ఆసక్తి పెంచాలనే ఆశయంతో శతాబ్ది ఉత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారని తెలిపారు.
రానున్న కాలంలో భారతదేశం పురుషులు ,మహిళల రెండు విభాగాలలో కూడా ఒలింపిక్స్ లో స్వర్ణ పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అందుకోసం హాకీ ఇండియా విశేషంగా కృషి చేస్తున్నదని అన్నారు.
హాకీ ఆంధ్ర అధ్యక్షులు చాణక్య రాజు పర్యవేక్షణలో, నంద్యాల హాకీ సంఘం అధ్యక్షులు పాల్ రాజారావు, కార్యదర్శి ముత్యంరాజు, సంయుక్త కార్యదర్శి దివాకర్, ఉపాధ్యక్షులు స్టీఫెన్,కోచ్ శ్రావణ్, కార్యవర్గ సభ్యుడు కెనడి లు ఉత్సవాల నిర్వహణ ఏర్పాటు చేస్తున్నారు.
పాత్రికేయ సమావేశంలో చాణక్య రాజు, డాక్టర్ రవికృష్ణ లతోపాటు, నంద్యాల హాకీ సంయుక్త కార్యదర్శి జెడ్.ఎస్.పి.దివాకర్, ఉపాధ్యక్షులు స్టీఫెన్,కోచ్ శ్రావణ్ పాల్గొన్నారు.

# ఏపీ ఎస్ బి సి ఎల్, ఐ ఎం ఎఫ్ ఎల్ డిపోను తనిఖీ చేసిన జెసి.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 31:**జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఏపీ ఎస్ బి సి ఎల్ మరియు ఐ ఎం ఎఫ్ ఎల్ డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్... డిపోలో ఉన్న ఐ ఎం ఎఫ్ ఎల్ మరియు బీర్ స్టాక్ యొక్క ప్లాట్లను క్షుణ్ణంగా పరిశీలించి స్టాక్ యొక్క ఓపెనింగ్ బ్యాలెన్స్ చెక్ చేయడం జరిగింది.
డిపో లో ఉన్న రికార్డులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే డిపో సేల్స్, ఏపీ సురక్ష యాప్, గురించి డిపో మేనేజర్ నాగేష్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిపో పరిసరాలను కలియతిరిగి ఐ ఎం ఎల్ మరియు బీర్ లోడింగ్ అన్ లోడింగ్ కేసులకు సంబంధించి అక్కడి సిబ్బందికి పలు అంశాలు తెలియజేసి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపర్వైజర్ కోటిరెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది, డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జనాభా లెక్కల పైలట్ ప్రాజెక్టుగా మహానంది మండలం.



**ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 31:**
రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనాభా లెక్కల సేకరణ కార్యక్రమం పైలెట్ ప్రాజెక్టుగా మహానంది మండలం ఎంపిక అయినట్లు తహసిల్దారు రమాదేవి తెలిపారు. శుక్రవారం తహసిల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ప్రాంతాలను ఎంపిక చేయగా కార్పొరేషన్ కింద వైజాగ్, నగర పంచాయతీగా పొదిలి, గూడెం కొత్త దీవి మన్యం జిల్లా, రూరల్ మండలం కింద నంద్యాల జిల్లా మహానంది మండలం ఎంపిక చేయబడిందన్నారు. ఈ పైలెట్ ప్రాజెక్టులో హౌస్ లిస్టింగ్ బ్లాక్ 65 ఎనమోరేటర్స్ గా 67 మంది సూపర్వైజర్స్ గా 11 మందిని ఎంపిక చేసి వీరికి నవంబర్ 4 5 6 తేదీలలో శిక్షణ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈసారి ప్రత్యేకంగా సెల్ఫ్ ఎనిమెటేషన్ నిర్వహిస్తారన్నారు. దీని ద్వారా సొంతంగా పేర్లు నమోదు చేసుకోవచ్చని ఈ జనాభా సేకరణకు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. నవంబర్ 10 నుండి 30 వరకు జనాభా సేకరణ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికి తిరిగి జనాభా సేకరణ చేయడం జరుగుతుందన్నారు.

# హెల్త్ అండ్ వెల్త్ సంస్థకు డబ్బులు చెల్లించిన బాధితులకు న్యాయం చేస్తాం.

**బాధితులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 31:**
దొర్నిపాడు మండలంలో "హెల్త్ అండ్ వెల్త్ ఫైనాన్స్ సొల్యూషన్" పేరుతో పనిచేసిన సంస్థ ఉద్యోగాల పేరుతో ప్రజలను మోసం చేసిన ఘటనపై బాధితులకు న్యాయం చేసేందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శుక్రవారం నంద్యాల కలెక్టరేట్లోని పి.జి.ఆర్.ఎస్ హాల్ లో, హెల్త్ అండ్ వెల్త్ సంస్థకు డబ్బులు చెల్లించిన బాధితులతో కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ ఆళ్లగడ్డ డిఎస్పి ప్రమోద్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, "హెల్త్ అండ్ వెల్త్" అనే సంస్థ "వర్క్ ఫ్రమ్ హెూమ్" పేరుతో ఉద్యోగాలివ్వాలన్న నెపంతో సుమారు 850 మంది బాధితుల నుండి ఒక్కొక్కరి వద్ద 3.6 లక్షల రూపాయలు వసూలు చేసిందని తెలిపారు. ఒక్కొక్కరు నెలకు అరగంట పని చేస్తే రూ.40 వేల జీతం ఇస్తామని చెప్పి చాలామందిని నమ్మబలికారని చెప్పారు. దీంతో బాధితులు ఇంట్లోని బంగారం, ఇళ్లు, ఆస్తులను తాకట్టు పెట్టి ఆ సంస్థ నిర్వాహకులకు డబ్బులు చెల్లించినట్లు తెలిపారు. ఈనెల జీతాలు ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారని వివరించారు. బాధితులు ఇప్పటివరకు సంస్థ నుండి ఎటువంటి అగ్రిమెంట్ లేదా లిఖిత పూర్వక ఒప్పందం తీసుకోలేదని.... వారు అందించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకొని పోలీసులు డాక్యుమెంటేషన్, దర్యాప్తు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. బాధితులు జిల్లా యంత్రాంగానికి సహకరిస్తే త్వరితగతిన న్యాయం చేస్తామన్నారు. అలాగే, పోలీస్ శాఖ ఇప్పటికే హెల్త్ అండ్ వెల్త్ సంస్థ బ్యాంకు ఖాతాలు, ఆస్తుల వివరాలను స్వాధీనం చేసుకునే ప్రక్రియలో ఉందని, వీటి ద్వారా డబ్బు ప్రవాహంపై లోతైన విచారణ జరపనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పూర్తవ్వడానికి రెండు నుంచి మూడు నెలల సమయం పడుతుందని, ఆ తర్వాత కోర్టు ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేస్తామన్నారు. బాధితులు ఎటువంటి ధర్నాలు, గందరగోళాలు చేయకుండా అధికార యంత్రాంగానికి సహకరించాలి" అని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ మాట్లాడుతూ, హెల్త్ అండ్ వెల్త్ సంస్థకు డబ్బులు చెల్లించి మోసపోయిన బాధితుల ఫిర్యాదుల ఆధారంగా ఈనెల 14వ తేదీన అధికారికంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు అయిన అనంతరం చట్టపరమైన అన్ని ప్రక్రియలు వేగంగా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. బాధితులు తమ వద్ద ఉన్న సంబంధిత వివరాలు, సాక్ష్యాలు, బ్యాంక్ రసీదులు వంటి సమాచారాన్ని పోలీసు శాఖకు అందిస్తే, విచారణ మరింత సులభతరం అవుతుందన్నారు. పోలీస్ శాఖ ఇప్పటికే సంస్థ నిర్వాహకుల బ్యాంకు ఖాతాలు, ఆస్తుల వివరాలను గుర్తించే ప్రక్రియలో ఉందని తెలిపారు. అవసరమైన ఆధారాలు సేకరించిన తర్వాత, ఆస్తులను సీజ్ చేసి కోర్టుకు అప్పగించడం, తద్వారా బాధితులకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం," అని ఎస్పీ స్పష్టం చేశారు. కేసు చట్టపరమైన దశల్లోకి వెళ్ళిన తర్వాత మొత్తం ప్రక్రియ పూర్తవ్వడానికి రెండు నుండి మూడు నెలల సమయం పట్టవచ్చని తెలిపారు. బాధితులు ఎటువంటి ఆందోళన గానీ, అశాంతి గానీ చెందకుండా పోలీస్ యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తే, తప్పకుండా త్వరితగతిన న్యాయం జరిగేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# పంట నష్టం అంచనాలను పరిశీలిస్తున్న అధికారులు.



**ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 31:** తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలను మహానంది మండల వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది పంట నష్ట అంచనాలను క్షేత్రస్థాయిలో వివిధ గ్రామాల్లో తిరిగి పరిశీలిస్తున్నారు. మండలంలో ప్రధానంగా వివిధ గ్రామాల్లో అత్యధిక శాతం వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆగమేగాలపై పంటలు దెబ్బతిన్న పొలాలను పరిశీలన క్షేత్రస్థాయిలో చేపట్టారు. పడిపోయి నీటిలో మునిగి నానుతున్న వరి పంటలో మొలకలు వస్తున్నాయేమో అని పరిశీలించి ప్రస్తుతం తుఫాను కారణంగా నేల వాలి నీటిలో మునిగి ఉన్న వాటి పరిస్థితి ఏమి అని రైతులను అడిగి తెలుసుకున్నారు. దీంతో రైతులు తుఫాను కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తమను ఆదుకోవాలని ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయ సహకారాలు మానవతా కోణంలో అందే విధంగా చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చిన వ్యవసాయ శాఖ అధికారులు మరియు సిబ్బందిని వేడుకున్నారు. ఒక్కొక్కరికి 350 రూపాయల చొప్పున చెల్లించి పడిపోయిన వరి పంటను కట్టలు కట్టుతున్నామని కనీసం ఒక ఎకరా కట్టలు కట్టడానికి దాదాపు 15 వేల రూపాయలు ఖర్చవుతుందని అధికారులకు తెలియజేశారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దీనంగా ఉన్నట్లు రైతులు తెలిపారు. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం మహానంది మండలంలో ప్రధానంగా వరి 8, 500 ఎకరాలు, అరటి 5,600 ఎకరాలు, పసుపు 350 ఎకరాలు , మినుము 850 ఎకరాలు, మొక్కజొన్న వెయ్యి ఎకరాలు, పెసర 10 ఎకరాలు, మరికొన్ని ఉద్యాన పంటలు ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో సాగులో ఉన్నట్లు వ్యవసాయ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం ప్రధానంగా దాదాపు 90 శాతం పైనే మొక్కజొన్న కోతలు (హార్వెస్టింగ్) పూర్తయినట్లు సమాచారం. తుపాను కారణంగా దెబ్బతిన్న పంటల అంచనాలను శుక్రవారం సాయంత్రానికి పూర్తి చేసి నివేదికలు అందజేయాలని రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారుల నుండి క్రింది స్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయినట్టు తెలుస్తుంది. కానీ క్షేత్రస్థాయిలో కిందిస్థాయి సిబ్బందికి కొన్ని అవరోధాలు ఎదురవుతున్నట్లు తెలుస్తుంది. నివేదిక గడువును రాష్ట్ర, జిల్లా ఉన్నత స్థాయి అధికారులు ఒకటి రెండు రోజులు గడువును పెంచుతారా లేదా అనేది తెలియాల్సి ఉంది.

# నాపరాతి గనుల యజమానుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.!

**మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.**





**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె అక్టోబర్ 31:**
కొలిమిగుండ్లలోని బెలూమ్ గుహల సమీపంలో నాపరాతి గనుల యజమానులతో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సమావేశం. ఈ సందర్భంగా నాపరాతి గనుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చిన గనుల యజమానులు. నాపరాతి పరిశ్రమ రాయల్టీ వసూళ్లు ప్రైవేట్ సంస్థకు అప్పగించడంపై ఆందోళన వ్యక్తం చేసిన నాపరాతి పరిశ్రమ యజమానులు.నాపరాతి పరిశ్రమపై పరోక్షంగా, ప్రత్యక్షంగా వేల మంది కార్మికులు ఆధారపడి పనిచేస్తున్న క్రమంలో వారి సమస్యలకు పరిష్కారానికి కృషి చేస్తాం. నాపరాతి పరిశ్రమ సమస్యలను పరిష్కరించి తిరిగి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాం.గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి నాపరాతి పరిశ్రమ సమస్యలను తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం తీసుకొస్తాం.

# నంద్యాలను వరద ముప్పు నుంచి కాపాడాలని సిపిఎం వినతి.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 31:**చామకాలువ, కుందూ నది, మద్దిలేరు వాగుల వెంట రక్షణ గోడను నిర్మించి నంద్యాల పట్టణాన్ని వరద ముప్పు నుంచి ప్రజలను రక్షించాలని కోరుతూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో జీరో హవర్లో కౌన్సిలర్ల సమక్షంలోనే మున్సిపల్ చైర్ పర్సన్ మాభూన్నిసా కు, మునిసిపల్ కమిషనర్ శేషన్న కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కే మహమ్మద్ గౌస్, పుల్లా నరసింహులు వీరితో పాటు రామకృష్ణ,పరమేష్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నంద్యాల పట్టణానికి వరద వచ్చిన ప్రతిసారి లోతట్టు ప్రాంతాలైన విశ్వనగర్, సలీం నగర్, శ్యామ్ నగర్, ఎన్జీవోస్ కాలనీ రోడ్డు, సిపిఎం ఆఫీస్ ఏరియా, బయటిపేట, హరిజన పేట, వైఎస్సార్ నగర్ లాంటి లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అవుతున్నాయి. వాటి వలన ప్రజలకు తీవ్రమైన ప్రాణ నష్టం,ఆస్తి నష్టం వాటిల్లుతుంది కనుక చామకాలువ,కుందూ నది, మద్దిలేరు వాగుల వెంట వరద రక్షణ గోడను నిర్మించి శాశ్వత పరిష్కారం చూపించాలని సిపిఎం పార్టీగా 72 గంటల దీక్ష, 48 గంటల పాటు దీక్ష లతోపాటు అనేక రూపాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అయితే అప్పుడు ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం నుండి నిధులను సాధించుకున్న వాటిని నేటి వరకు పూర్తిగా వినియోగం చేయకపోవడం వలన ప్రతిసారి రక్షణ గోడ కోసం వచ్చిన నిధులు వెనక్కి పోతున్నాయి. పాలకుల నిర్లక్ష్యం వలన ప్రజలకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు కావున వరద రక్షణ గోడ ను నిర్మించేందుకు ప్రభుత్వం నుంచి నిధులను తీసుకువచ్చిన వెంటనే పనులను యుద్ధ ప్రాతిపదికన మొదలుపెట్టాలని, అదేవిధంగా ఇప్పటికే వరదల వలన నష్టపోయిన కుటుంబాలను ఆదుకునేందుకు ప్రతి కుటుంబానికి పదివేల రూపాయలు చొప్పున ఇచ్చి వారం రోజులకు సరిపడా ఆహార పదార్థాలు, నిత్యవసర సరుకులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## కుందూ నదిపై నూతన బ్రిడ్జి ప్రారంభించలేరా..?

**బ్రిడ్జిని చదును చేసి ఏదో అభివృద్ధి చేశామని టిడిపి నాయకులు అనుకుంటున్నారా.?**

**టిడిపి నాయకులకు మరియు ప్రస్తుత ప్రభుత్వానికి గుర్తుందా.?**

**10% మిగిలిన బ్రిడ్జిని అధికారంలోకి వచ్చి సంవత్సర కాలమైన పూర్తి చేయడంలో విఫలమైన మంత్రి ఎన్ ఎమ్ డి ఫరూక్.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 31:** నంద్యాల సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు మొంధా తుఫాను దాటికి దెబ్బతిన్న పాత బ్రిడ్జిని పరిశీలించి, కొత్త బ్రిడ్జి పనులను పూర్తి చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తూ టీడీపీ ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుందని విమర్శించారు. ఎస్ డి పి ఐ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ కలాం మాట్లాడుతూ టిడిపి నాయకులు సార్వత్రిక ఎన్నికలలో కుందనది కొత్త బ్రిడ్జిని పూర్తి చేయడంలో గత ఎమ్మెల్యే విఫలమయ్యారని తామ అధికారంలోకి వచ్చిన వెంటనే మరియు సంవత్సర కాలంలో పూర్తి చేస్తామని ఇచ్చిన హామీ ఏమైంది అని ప్రశ్నించారు. అదేవిధంగా పాత బ్రిడ్జి పైనవున్నా గుంతలు తవ్వి దానిపైనే నంద్యాల పట్టణ ప్రజలు ప్రయాణించండి అని చెప్పడం చాలా బాధాకరమని, కొత్త బ్రిడ్జిని పూర్తి చేయడంలో నంద్యాల ఎమ్మెల్యే మరియు మైనార్టీ మంత్రి ఎన్ ఎమ్ డి ఫారుక్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. వెంటనే ఇప్పటికైనా మేల్కొని యుద్ధ ప్రాతిపదికన బ్రిడ్జిని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రాణం అంతా రక్తంలోనే ఉంది

## - రక్తదానం చేసి ప్రాణదాతలు కండి.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 31:**ఆపదలో ఉన్నవారి ప్రాణాలు నిలిపే ఒక మహోన్నత వేదిక కావాలని భావించి బనగానపల్లెలోని కేజిఆర్ విద్యా సంస్థల సహకారం తో ఫ్రెండ్స్ ఫర్ సేవా వారి ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారుల కోసం మరియు గర్భిణీ మహిళల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.రక్తదాన శిబిరాన్ని కేజీఆర్ కళాశాల అధినేత రామచంద్రారెడ్డి,నంద్యాల బ్లడ్ సెంటర్ మేనేజర్ బ్లడ్ అచ్చు,ఫ్రెండ్స్ ఫర్ సేవా ఫౌండర్ రాగురు ఫణింద్ర,చైర్మన్ విష్ణు గాయత్రి లు ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి అవసరమైన వారికి గ్రూపు సంబంధించిన రక్తం లభించక ఎంతో మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటు చేసుకుంటుడటం తో పాటు ఫ్రెండ్స్ ఫర్ సేవా సభ్యులు చేస్తున్న కార్యక్రమాలు ఎంత అమోఘం అని యువకులు సమాజంలో చెడు అలవాట్లకు దూరమై ఇటువంటి మంచి కార్యక్రమాలకు చేయూతనిస్తూ ప్రోత్సహిస్తూ,ఇలాంటి కార్యక్రమాలలో ముందు ఉండి, ప్రోత్సాహించాలని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఒకరిని చూసి ఇంకొకరు కార్య క్రమాలు చేయాలని ఆసక్తి వస్తుందని చెప్పారు.రక్తదాన కార్యక్రమంలో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేయడం జరిగిందని, అలాగే రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాలు అందజేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఫర్ సేవా బ్లడ్ డైరెక్టర్ బాబుజి నాయక్, ఈ ఈ బ్లడ్ కో డైరెక్టర్ దానకిషోర్, నంద్యాల బ్లేడ్ సెంటర్ ఎండి బ్లడ్ అచ్చు ,ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ ప్రతినిధి షాషావలి, ఉదయ్,మణి,మౌలా,కేజీఆర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## టీటీడీ పరకామణి చోరీ కేసు పై హైకోర్టులో విచారణ

అమరావతి,**అక్టోబర్ 31ఆంధ్ర ప్రగతి**

టీటీడీ పరకామణి చోరీ కేసు పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ఈ క్రమంలో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. న్యాయస్థానం నోటీసులు జారీ చేసిన వారిలో దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి, లీగల్ సర్వీసెస్ అథారిటి మెంబర్ సెక్రటరీ, తిరుపతి మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, సీఐడీడీజీ, టీటీడీ ఈవో, సీవీఎస్ఓ, తిరుపతి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓ, పరకామణి అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి సతీష్ కుమార్, నిందితుడు పీవీ రవికుమార్ ఉన్నారు. అయితే తదుపరి విచారణని నవంబరు 17వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది. పరకామణి చోరీ కేసులో లోక్ అదాలత్ ఇచ్చిన ఉత్తర్వుల చట్టబద్ధతను తేల్చే వ్యవహారాన్ని న్యాయమూర్తులు జస్టిస్ రఘునందనరావు, జస్టిస్ సుభేందులకు చీఫ్ జస్టిస్ అప్పగించారు. పరకామణి చోరీ కేసుపై రాజీ, ఇతర అంశాలపై తాను ఇచ్చిన ఉత్తర్వులను సీజే ముందు ఉంచాలని గతంలో సింగిల్ జడ్జ్ ఆదేశించిన విషయం తెలిసిందే.

# పంటలు నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం ఇవ్వాలి..!

**- పడిపోయిన పంట పొలాలను పరిశీలించిన మాల మహానాడు జె ఏ సీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 31:**

అధిక వర్షాల వల్ల పంట నష్టపోయిన ప్రాంతాల్లో మాల మహానాడు రాష్ట్ర జె ఏ సీ కార్యదర్శి దస్తగిరి బృందం పర్యటించి నష్టపోయిన పంటల వివరాలు నాయకులు రైతులను అడిగి తెలుసుకున్నారు.శుక్రవారం వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఈ బృందం విస్తృత పర్యటన చేపట్టారు.నంద్యాల, పాణ్యం, గోస్పాడు మండలాల్లో కానాల, తొగర్చేడు, పుసలూరు, మిట్నాల, తెల్లపురి, పసురపాడు, గోస్పాడు తదితర గ్రామాల్లో పర్యటించిన నాయకులతో రైతులు తమ బాధలను చెప్పుకున్నారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టిన పంట పండిస్తే తీరా పంట చేతికి వచ్చే దశలో అకాల తుఫాన్ లు వచ్చి అపార నష్టాన్ని మిగిలించిందని, పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎలా చెల్లించాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని రైతులు తమ ఆవేదనను నాయకుల ముందు వెళ్లగక్కారు. పాలకులు తమను ఆదుకుంటారని గంపెడు ఆశలతో ఎదురుచూస్తున్నామని నాయకులతో అన్నారు. ఒక ఎకరాకు 35 వేల నుండి 40 వేల వరకు పెట్టుబడి పెట్టామని, 18 బస్తాల వరి ధాన్యం కౌలుకు తీసుకున్నామని, తీరా పంట చేతికి వచ్చే దశలో అధిక వర్షం వల్ల పంట అంతా నేలపాలై మోకాళ్ళ లోతు పొలాల్లోనీళ్లు పారుతున్నాయని రైతులు తమ ఆవేదనను వెళ్లగక్కారు. పొలాల్లో మొక్కజొన్న పంట నేల పాలు కావడమే కాకుండా పోసిన తర్వాత కల్లాలలో కూడా తడిసిపోయి, రంగు మారి, మొలకెత్తి మొక్కజొన్న పంట నష్టపోయామని, మిరప పంటలో నీళ్లు అధికమై చనిపోతున్నాయని, ఈ మధ్యనే విత్తనంవేసిన పప్పు శనగ, జొన్న పంటలు మొలక దశలోనే నీళ్లు నిలబడి చనిపోవడం వల్ల తీవ్రంగా నష్టపోయామని నాయకుల ముందు వాపోయారు.

### అకాల వర్షాలతో దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి.

ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర జె ఏ సీ కార్యదర్శి దస్తగిరి మాట్లాడుతూ జిల్లాలో వరుసగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఖరీఫ్ సీజన్లో వేసిన మొక్కజొన్న ,వరి, మిరప, పత్తి పంటలు పూర్తిగా చేతికి వచ్చే దశలో నష్టపోవడం వల్ల రైతులందరికీ తీవ్రమైన నష్టం వాటిల్లిందన్నారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అన్ని గ్రామాల్లో పంటలు వేసి నష్టపోయిన రైతులందరికీ ఎకరాకు నలభై వేల రూపాయలు నష్టపరిహారంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పంటల బీమా వర్తింపు చేయాలని,కౌలు రైతులందరికీ కూడా నష్టపరిహారం, బీమా వర్తింపజేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. వర్షానికి తడిసి, మొలకెత్తి నష్టపోయిన మొక్కజొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అంతంత మాత్రం ఉన్న పంటల ఉత్పత్తులను తక్షణమే కొనుగోలు చేయడానికి అన్ని మండల కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలు అమలు చేసి, రైతుల వద్ద ఉన్న మొత్తం పంటలను అన్నింటిని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతాంగానికి న్యాయం చేయాలని వారు కోరారు. అలాగే తెల్లపురి వద్ద గత మూడు రోజుల నుండి కుందూ నది బ్రిడ్జి పైన నీళ్లు పారుతుండడంతో రాకపోకలు ఆగిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారనీ, కుందూ నది కి ఇరువైపులా ఉన్న గ్రామాల్లో పంట పొలాలన్నీ తీవ్రంగా నష్టపోయారని, రాబోయే రోజుల్లో నైనా కుందూ పరివాహ ప్రాంతా రైతులకు శాశ్వత పరిష్కారం చేసేందుకు కృషి చేయాలని, తెల్లపురి వద్ద కొత్త బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నంద్యాల జిల్లా అధ్యక్షుడు బండి దేవాంతకుడు, రాయలసీమ అధ్యక్షులు మద్దిలేటి, మాలమానాడు నంద్యాల మండల యువజన అధ్యక్షులు దేవదాస్ తదితర మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

# అభిరుచి మధు ఆధ్వర్యంలో ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు.











**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 31:**

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు భారతీయ జనతా పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆధ్వర్యంలో సర్దార్ వివల్లభాయ్ పటేల్ దేశ ఐక్యత కోసం కృషి చేయడం జరిగింది. ఈరోజు ఆయన చేసిన కృషికి గుర్తింపుగా నంద్యాల పట్టణంలోని వివాకానంద విగ్రహం నుండి బస్టాండు మున్సిపల్ ఆఫీస్ పద్మావతి నగర్ మీదుగా శ్రీనివాస్ సెంటర్ వరకు జాతీయ తా ఐక్యత ర్యాలీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి. ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి భారతీయ జనతా పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు మాట్లాడుతూ.. దేశ ఐక్యత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ త్యాగం మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మెంబర్ మేడ మురళి, ఇంటి ఆదినారాయణ, నిమ్మకాయల సుధాకర్, కాసేపు చంద్ర, తూము శివారెడ్డి, శివ కృష్ణ, ఒంటెద్దు కిరణ్, డాక్టర్ నారాయణ, ఉపేంద్ర, చాందిని, షేక్ ఆసిన మండల అధ్యక్షులు జిల్లా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.

# భవనాశి వాసు ఆధ్వర్యంలో ఘనంగా ఉక్కుమనిషి జయంతి.

**-సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆత్మస్ఫూర్తితో సేవలో ముందున్న భవనాశి వాసు.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 31:**

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు దేశ ఉక్కుమనిషి, ఐక్యత దూత సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు నంద్యాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నిత్య అన్నదాత, జనసేన నాయకులు భవనాశి వాసు ఆదేశాల మేరకు ఆయన కార్యాలయంలో నాగి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా నాగి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ భారత ఏకీకరణకు చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన నాయకత్వం తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఉక్కుమనిషి చూపిన మార్గంలో నడుస్తూ ప్రతి ప్రజానాయకుడు దేశ సేవకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఎవరు ఆకలితో ఉండకుండా చూసే ఉద్దేశంతో భవనాశి వాసు ప్రతిరోజూ నిరంతరంగా నిర్వహిస్తున్న ఈ సేవలు ప్రశంసనీయమని అన్నారు. సామాజిక సేవే అత్యున్నత సేవగా భావించి నిత్యం ప్రజల కోసం కష్టపడుతూ ఉంటాడని నాగి వెంకటేశ్వర్లు అభినందించారు. భోజనానికి వచ్చిన ప్రజలు భవనాశి వాసు తమకు దేవుడిలాంటివాడని, ప్రతిరోజూ నిస్వార్థంగా భోజనం వడ్డించి కడుపునింపుతున్నాడని అన్నారు. అతనికి దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు, స్థానిక నాయకులు సహా అనేకమంది పాల్గొన్నారు. వాసు కార్యాలయం ప్రాంగణంలో పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. జన సేన కార్యకర్తలు బొల్లవరం హరిప్రసాద్, పెద్ద మురళి, కాకర్ల రామకృష్ణ, మిద్దె మహేష్ మిద్దె నాగేష్, చక్రపాణి, విజయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# నంద్యాల జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో వైభవంగా

# సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు.

**జాతీయ ఏక్తా దివస్ వేడుకలు సుమారు 250 మంది విధ్యార్థిని విద్యార్థులతో మరియు పోలీసు అధికారులు, సిబ్బందితో ఐక్యతా పరుగు నిర్వహించిన నంద్యాల జిల్లా పోలీసులు.**

**దేశ సమగ్రత, ఐక్యతకు కృషి చేసిన పటేల్ జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి. - జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 31:**
నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయం నందు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ సునీల్ షరాణ్ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సంధర్భంగా ఎస్పీ గారు ఆయన చిత్రా పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సంధర్భంగా అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ జాతీయ సమైక్యతను చాటుతూ నంద్యాల జిల్లా పోలీసులు నంద్యాల పట్టణ కేంద్రంలోని ఎస్ పి జి గ్రౌండ్ నందు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా సుమారు 250 మంది విధ్యార్థిని విద్యార్థులతో మరియు పోలీసు అధికారులు, సిబ్బందితో ఐక్యతా పరుగు నంద్యాల పోలీసులు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షరాణ్ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు మరియు పోలీస్ అధికారులతో జాతీయ సమైక్యత పరుగు సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు.ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 31 న జాతీయ ఐక్యతా దినోత్సవం లేదా రాష్ట్రీయ ఏక్తా దివస్ జరుపుకుంటారన్నారు. సువిశాల భారతావనిని ఏకతాటిపై నడిపించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం మనకు ఆదర్శప్రాయం బ్రిటీషర్లు భారత్‌ను విడిచి వెళ్లాక... దేశ రక్షణ, సమగ్రత కోసం, భారతదేశాన్ని ఐక్యంగా ఉంచడంలో ఆయన చేసిన కృషి గురించి అవగాహన కల్పించడమే ఈ వేడుక యొక్క ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం ఐక్యత పరుగును జెండా ప్రారంభించడం జరిగింది.
అనంతరం ఈ ఐక్యత పరుగు ఎస్పీజీ గ్రౌండ్




నుండి వై.జంక్షన్,మున్సిపల్ ఆఫీసు,పద్మావతినగర్,టెక్కేమీదుగా మార్కడ్ యార్డ్ వరకు కొనసాగింది.
ఈ యూనిటి రన్ లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్ధానాలు సాధించిన క్రీడాకారులకు మార్కెట్ యార్డ్ నందు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి ఎం.జావళి బహుమతులను అందజేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి ఎం.జావళి ఐపీఎస్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి, ఏ ఆర్ డి ఎస్ పి శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్లు కంబగిరి రాముడు, ఈశ్వరయ్య అస్రర్ భాష , ఆర్ ఐ లు మంజునాథ్ ,సురేష్ బాబు సబ్ ఇన్స్పెక్టర్లు ఔత్సాహికులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


















## దేశ రక్షణ ,సమాజ శ్రేయస్సు కొరకు ప్రాణాలు అర్పించిన పోలీసుల త్యాగాలను మరువలేం..!

**విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు నివాళులు అర్పిస్తూ క్యాండిల్ ర్యాలీ నిర్వహణ. -జిల్లా ఎస్పీ సునీల్ సునీల్ షొరాణ్.**








**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ అక్టోబర్ 31:**
పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు నివాళులు అర్పించేందుకు జిల్లా ఎస్పీ సునీల్ సునీల్ షోరాణ్ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణ కేంద్రంలోని శ్రీనివాస సెంటర్ నుండి గాంధీ చౌక్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 31 తేదీన విధినిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకునేందుకు ఈ క్యాండిల్ ర్యాలీని నిర్వహించడం జరిగింది. గత సంవత్సరం విధి నిర్వహణలో 166 మంది పోలీసులు అమరులయ్యారని తెలిపారు. అదేవిధంగా ఈరోజు ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పిలువబడే సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉదయం సమైక్యత పరుగు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రతి భారతీయుడు ముందుగా దేశం, దేశ సమగ్రత, సౌభ్రాతృత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలి. మన దేశంలో విభిన్న సంస్కృతులు ,జాతులు, కులాలు, మతాలు ఉన్న మనమందరం భారతీయులం అనేది మరిచిపోకూడదు. దేశ రక్షణ, సమగ్రత, కొరకు సువిశాల భారతదేశాన్ని ఏకతాటిపై నడిపిన సర్దార్ వల్లభాయ్ పటేల్ మనందరికీ స్ఫూర్తిదాయకమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి ఎం.జావళి ఆల్ఫోన్స్, జిల్లా అడిషనల్ ఎస్పి అడ్మిన్ ఎన్. యుగంధర్ బాబు, ఏ ఆర్ డి.ఎస్.పి శ్రీనివాసరావు, రిజర్వు ఇన్స్పెక్టర్లు, సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్లు, ఎన్సిసి విద్యార్థినీ విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నంద్యాలలో ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 31:**
ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవఓ నంద్యాల జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు నంద్యాల జిల్లా కేంద్రంలో కార్మిక అడ్డాల్లో జెండా ఆవిష్కరణ చేసు కొన్న తర్వాత సిపిఐ కార్యాలయం ముందు ఏఐటియుసి జెండాను ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య ఆవిష్కరించారు.
అనంతరం జరిగిన సభను ఉద్దేశించి ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు,ఎ ఐ టి యు సి నంద్యాల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డి. శ్రీనివాసులు, భూమన శ్రీనివాసులు పాల్గొని మాట్లాడినారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య మాట్లాడుతూ.. ఏఐటియుసి 1920 అక్టోబర్ 31వ తేదీన ముంబై మహానగరం నందు ఆనాటి స్వతంత్ర సమరయోధులు మోతిలాల్ నెహ్రూ బాలగంగాధర్ తిలక్ అనేకమంది స్వతంత్ర సమరయోధుల చేత వేలాది మంది కార్మికుల ఆధ్వర్యంలో ఆవిర్భావం చెందిందని స్వసంత్ర పోరాటంలో పాల్గొన్న ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ మాత్రమేనని అన్నారు. స్వాతంత్రం కన్నా ముందు నుండి స్వతంత్రం వచ్చిన తర్వాత 44 కార్మిక సంక్షేమ చట్టాలను సాధించి కార్మిక పక్షపాతిగా పెట్టుబడుదారుల దాష్టికానికి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు లాఠీ దెబ్బలు అశేష అమర త్యాగాలు చేసిన చరిత్ర అనేక పోరాట ఘట్టాలు విజయాలు సాధించిన చరిత్ర ఈ దేశంలో ఏ ఐ టి సి కార్మిక సంఘానికి మాత్రమే ఘనత దక్కిందని వారు అన్నారు. బిజెపి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోరాడి సాధించుకున్న 44 కార్మిక సంక్షేమ చట్టాలను నాలుగు కోడ్స్ గా తీసుకొని వచ్చి 8 గంటల పని విధానాన్ని తుంగలో తొక్కి కార్మికుల పని గంటలు 13 గంటలకు పెంచి వేతనాలు అడిగే హక్కును సమ్మె చేసే హక్కును హరించి కార్మికులకు ద్రోహం చేశారని వారి సందర్భంగా ఆగ్రహించారు ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని అంబానీలకు ప్రైవేటు కార్పొరేట్లకు అమ్మేశారని కష్టించి చెమటోడ్చి పనిచేసే కార్మికుల ను బానిసలుగా చేసే నరేంద్ర మోడీ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు డబల్ ఇంజన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.స్కీం వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వకుండా అసంఘటితరంగా కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయకుండా కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయకుండా నిర్లక్ష్యం చేసి మోసం చేసిన దుర్మార్గ కార్మిక వ్యతిరేక పాలకులపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.నంద్యాల జిల్లాలో నాపరాల పరిశ్రమలో లోడింగ్ అన్లోడింగ్ చేసే హమాలీ కార్మికులకు కడుపు కొట్టే విధంగా రాయల్టీ పేరుతోనే ప్రైవేటు ఏజెన్సీ పెట్టి టోల్గేట్స్ పెట్టి డబ్బా పెట్టి డబ్బులు వసూలు చేస్తూ కార్మికులను శ్రమ దోపిడీ చేసి ఉపాధి లేకుండా మోసం చేసే పాలకులపై తిరుగుబాటు పోరాటానికి సిద్ధం కావాలన్నారు.జిల్లాలో భవిష్యత్తులో పోరాటాల కోసం నవంబర్ 9వ తేదీన ఏఐటీయూసీ జిల్లా జలలబాడి సమావేశంలో చర్చించి కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలపై పోరాటాలను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుశీలమ్మ ఆర్టీసీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు శివ ట్రాలీ ఆటో యూనియన్ నాయకులు రమణారెడ్డి అనంతయ్య కృష్ణ ఏడుకొండలు పబ్లిక్ టాయిలెట్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు ఈశ్వరమ్మ సుబ్బమ్మ మెడికల్ రంగం నాయకురాలు తులసమ్మ పాములేటి సులోచన అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.




# తుఫాను వల్ల పంట నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం భరోసా!

**జనసేన పార్టీ నాయకులు దండు మురళీ కృష్ణ.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 31:**
మొంథా తుపాన్ వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టి, రైతులకు భరోసా కల్పించేందుకు సిద్ధంగా ఉన్నదని జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు దండు మురళీకృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మందిపై మొంథా తుఫాను ప్రభావం చూపిందని, సహాయక చర్యల్లోనే ప్రభుత్వ యంత్రాంగం చురుకుగా పనిచేస్తుందన్నారు.మొందా తుఫాను మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటన విడుదల చేశారన్నారు.అదేవిధంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.అంతేకాకుండా విద్యుత్, రహదారులు పునరుద్ధీరణకు తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.పునరావాస కేంద్రాల్లోని కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు, ఆర్థిక సాయం పంపిణీ చేయడం జరిగింది.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 297 రహదారులను దెబ్బ తినకుండా ప్రభుత్వం తక్షణ సహాయ చర్యలు చేపట్టిందన్నారు. అదేవిధంగా రహదారులపై విరిగిపడిన 380 చెట్లను తొలగించడం జరిగిందన్నారు. తుఫాను వలన ప్రజలకు అంటువ్యాధులు రాకుండా 2130 మెడికల్ క్యాంపుల నిర్వహణ ను ప్రభుత్వం చేపట్టిందన్నారు.మొంథా తుఫాన్ వెళ్ళిపోయింది కానీ అది సృష్టించిన బీభత్సం ఇంకా మిగిలే ఉంది అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు మరియు అధికారులతో సహా ప్రజల్లోకి వెళ్లి బాధితులకు అందించే సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు అన్నారు.పాలకులకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ యంత్రాంగం ఎంతటి అంకితభావంతో పనిచేస్తుందో చెప్పడానికి ఇదే ఒక నిదర్శనం అని చెప్పారు.వర్షాలు, గాలుల తీవ్రతను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, హెచ్చరికలు జారీ రాష్ట్రవ్యాప్తంగా రైతులను ప్రజలను ప్రభుత్వం అప్రమత్తం చేసిందన్నారు.సీఎం, డిప్యూటీ సీఎం దగ్గర నుంచి కింది స్థాయి అధికారి వరకు, ఒకే రకమైన రియల్ టైం సమాచారం ఉండేలా, రియల్ టైం డ్యాష్ బోర్డు యాక్సిస్ అందరు అధికారులకు సమాచారం అందిస్తూ, ముందస్తు చర్యలకు మరియు సహాయక చర్యలకు ఇది చాలా ఉపయోగ పడిందన్నారు.కూటమి నాయకులు, కార్యకర్తలు మోంతా తుఫాను ప్రభావ ప్రాంతాల్లో పునరుద్ధరణ, సహాయక మరియు పునరావాస కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన ప్రతి ఒక్కరికి నంద్యాల జిల్లా జనసేన పార్టీ తరపున దండు మురళీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

# గోసంరక్షణ ప్రాతి మానవుడి బాధ్యత.

**కీర్తిరాజదాస్ -ఇస్కాన్ ధర్మప్రచారకులు.**

**గోపూజతో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు.**




**ఆంధ్ర ప్రగతి ఆలూరు అక్టోబర్ 31:**మన సంస్కృతిలో గోవుకు ఎంతో విశిష్టమైన స్థానం ఉన్నదని, అటువంటి గోసంపదను రక్షించుకుంటేనే మన సంస్కృతిని రక్షించుకున్న వారమవుతామని ఇస్కాన్ ధర్మ ప్రచారకులు కీర్తి రాజదాసు స్వామి భక్తులకు పిలుపునిచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆలూరులోని శ్రీ సాయిబాబా మందిరం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక కార్యక్రమాలలో భాగంగా మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ప్రవచనం చేశారు. శుక్రవారం గోమాతకు పూజలు నిర్వహించి భక్తులందరితో ఈ దేశానికి, ధర్మానికి మూలాధారమైన గుడిని, గోవులను రక్షించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. తిరుమల తిరుపతి దేవస్థానముల నుండి నాలుగు రోజులపాటు కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి జి. శ్రీనివాసులు రెడ్డి, వై. వీరభద్ర గౌడ్, పి.రామాంజనేయరెడ్డి, ఒ.వీరభద్ర గౌడ్, విశ్వహిందూ పరిషత్తు మఠమందిర ప్రముఖ్ భరత్ కుబేర, కమిటీ సభ్యులు బి.ఎర్రిస్వామి, జె. మల్లికార్జున, ఎస్.బి. శ్రీనివాసులు, బి. సూర్యనారాయణ, బి. రఘునాథ్ రెడ్డి, కె.లోకన్న గౌడ్, జె.సిద్ధ లింగయ్య స్వామి, బి. మల్లిఖార్జున, ఎం నాగేంద్రయ్య అర్చకులు జె.ఎర్రి స్వామి, నాగభూషణం స్వామి, వెంకటేశ్వర్లుతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# బుగ్గ రాముడు ఆధ్వర్యంలో శర వేగంగా రోడ్డు పనులు ప్రారంభం.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 31:** నంద్యాల పట్టణ శివారులోని 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ నందు రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ ఎండి.ఫరూక్ భూమిపూజ చేసిన పదిరోజుల లోపే శరవేగంగా రోడ్డు పనులు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ ఇంచార్జి బుగ్గరాముడు మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం నర్రా కాలంలోనే దాదాపుగా వార్డు నందు 3కోట్ల రూపాయలు రోడ్లు కాలువల పనులు పూర్తి చేసిన ఘనత కేవలం ఒక కూటమి ప్రభుత్వానికే సాధ్యం అని ఆయన అన్నారు. అంతేకాక మరల 25లక్షల రూపాయలతో నూతన సీసీ రోడ్డు ప్రారంభించడం జరిగింది అని ఆయన అన్నారు. అలాగే మంత్రి ఎన్ ఎండి.ఫరూక్ అలాగే వారి కుమారులు ఫిరోజ్,ఫయాజ్ ఆధ్వర్యంలో వార్డు మరింత అభివృద్ధి బాటలో ముందుకు సాగుతోంది అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు తాటికొండ మహేష్ బాబు, వడ్డే నాగేంద్ర, హిమామ్ హుస్సేన్, చిన్న రాముడు, తేజ, మాభాషా,కల్కి రాఘవేంద్ర,మల్లయ్య రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయం.

**డోన్ డిఎస్పీ పి. శ్రీనివాసులు.**

**సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.**







**ఆంధ్ర ప్రగతి డోన్ అక్టోబర్ 31:** అక్టోబర్ 31 న మన భారత స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మరియు జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా డోన్ పట్టణంలో డోన్ డిఎస్పీ ఆఫీస్ నందు సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి ఆద్వర్యంలో డోన్ డి.ఎస్.పి పి. శ్రీనివాసులు అధ్యక్షతన స్వాతంత్ర్య సమరయోధులు సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ సి శివరంగయ్య, సలీం, రమేష్, బి.లక్ష్మీ రాజు, ఎస్. దస్తగిరి, సాయికిరణ్, శివ, డీఎస్పీ ఆఫీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంట నష్టాలపై గ్రామాల్లో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి.

**...రైతులు,పంట పొలాలంటే భూమా కుటుంబానికి ఎనలేని ప్రేమ.**

**...నాడు భూమా నాగిరెడ్డి...నేడు భూమా బ్రహ్మానందరెడ్డి.**

**...నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తానని హామీ.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 31:** నంద్యాల మండలంలో తుఫాన్ కారణంగా రైతులు భారీగా నష్టపోయారు.నంద్యాల మండలంలో పొలగ్రామల్లో రైతులు వేడిన పంటలు చేతికి వచ్చే సమయంలో వరదలకు తీవ్రంగా నష్టపోయారు.నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ప్రతి ఏటా రైతన్న మద్దతు ధర,వర్షాలు పడక,దిగుబడి రాక,వర్షాలు పడి రకరకాలుగా నష్టపోతున్నారు.ఈ ఏడాది యూరియా కొరత ,వరదలకు రైతులు కుదేలయ్యారు.వర్షం తగ్గుముఖం పట్టడంతో నంద్యాల నియోజకవర్గంలో అధికంగా రైతులు నష్టపోయిన సమాచారాన్ని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి తెప్పించుకున్నారు.మొదటగా కానాల,పాండురంగాపురం ప్రాంతాల్లో పొలాల్లోకి వెళ్ళి వారి పంటను పరిశీలించారు.రైతులు ఆయన వద్దకు చేరుకొని కోతకు వచ్చేసమయంలో అకాల తుఫాను వల్ల తీవ్రంగా నష్టపోయామని,అప్పులు చేది మందులు కొనుగోలు చేశామని ప్రభుత్వం రైతులకు న్యాయం జరిగేలా సహాయం చేయాలని ఆయన దృష్టికి తీసుకొచ్చారు.భూమా కుటుంబానికి ప్రధానంగా రైతులన్నా,పంట పోలాలన్నా ఎంతో ఇష్టం.ఎవరైనా వారికి నష్టం కలిగిస్తే చాలు అక్కడికి వెళ్లిపోవడం వారికే చెల్లుబాటు అవుతుంది.గతంలో భూమా నాగిరెడ్డి హయంలో నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు న్యాయం జరిగే లా కంపెనీ ప్రతినిధులతో చర్చించి నష్టపరిహారం ఇప్పించారు.యూరియా సైతం అధిక ధరలకు విక్రయించకుండా చేసేవారు.భూమా నాగిరెడ్డి అనుసరించే విధానాలే భూమా బ్రహ్మానందరెడ్డి అనుసరిస్తూ తనదైన శైలిలో సున్నితంగానే,మాట్లాడుతూ అనుకున్న వారికి న్యాయం జరిగేంతవరకు కృషిచేస్తారు.¬ ౖతులన్నా,కార్యకర్తలన్నా పదవులు ఉన్నా,లేకపోయినా వారివద్దకు వస్తె పని జరిగేంతవరకు పోరాటం చేయడమే ఆ కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య.ఈ నేపధ్యంలో రాష్ట్రవ్యాప్తంగా తుఫాన్ తాకిడికి నష్టపోయిన రైతుల సమస్యలు,పంటపొలాల్లో వారి పంటను పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందేలా నా వంతు కృషిచేస్తానని అన్నారు.వ్యవసాయ అధికారులు సైతం రైతులకు నష్టపరిహారం న్యాయంగా అందించాలని అన్నారు.రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు.నంద్యాల నియోజకవర్గంలో నష్టపోయిన రైతుల వివరాలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకొని వెళ్ళి నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తానని అన్నారు.





# ఆత్మకూరు టౌన్ సీఐ రాము కు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి పిలుపు.

**సీఎం చంద్రబాబు చేతుల మీదుగా సీఐ రాముకు గౌరవ సత్కారం.**

**తుఫాను సమయంలో సీఐ రాము సేవలు అంకితభావం, అప్రమత్తత.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా అక్టోబర్ 31:** నంద్యాల జిల్లా ఆత్మకూరు టౌన్ సీఐగా రాము 'మోందా తుఫాన్' సందర్భంగా తన విధుల పట్ల చూపిన అంకితభావం అభినందనీయం. ?రాత్రింబవళ్ళు శ్రమ తుఫాను మూడు రోజుల పాటు ఏకధాటిగా వర్షాలు కురిపించినప్పటికీ, సీఐ రాము రాత్రనకా పగలనకా కష్టపడి పనిచేశారు. ఇది కేవలం విధి నిర్వహణే కాకుండా, ప్రజల భద్రత పట్ల ఆయనకున్న అధిక బాధ్యతా భావాన్ని సూచిస్తుంది.ముందస్తు అప్రమత్తత, భారీ వర్షాల కారణంగా సిద్దాపురం చెరువు మరియు భవనాసి నది ఉప్పొంగే ప్రమాదం ఉందని గుర్తించి, ఆయన తన పరిధిలోని ప్రజలందరినీ ముందుగానే అప్రమత్తం చేశారు. సరైన సమయంలో ఈ సమాచారం అందించడం వల్ల పెను ప్రమాదాలు తప్పాయి.

ట్రాఫిక్ నియంత్రణ మరియు భద్రత: వరదనీరు ప్రవహించే ప్రాంతాలలో వాహనదారులను మరియు చుట్టుపక్క ప్రాంతాల నివాసితులను అప్రమత్తం చేయడంలో, ప్రత్యామ్నాయ మార్గాలను సూచించడంలో ఆయన ప్రధాన పాత్ర పోషించారు. ఇది ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా, వారి ప్రాణాలకు ఎటువంటి ముప్పు వాటిల్లకుండా చూడడంలో కీలకమైంది.మానవత్వంతో కూడిన సేవ వరదల వల్ల అత్యవసర పరిస్థితులు ఎదుర్కొనే ప్రజలకు సహాయం చేయడానికి, సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఆయన నిరంతరం తన బృందంతో పాటు అందుబాటులో ఉండి, పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకాన్ని పెంచారు.

ముఖ్యమంత్రి కార్యాలయం

ఇలాంటి విపత్కర పరిస్థితులలో సీఐ రాము చూపిన నిస్వార్థ సేవ, తక్షణ స్పందన మరియు సమర్థవంతమైన నిర్వహణను గుర్తించిన ఆంధ్ర రాష్ట్ర సీఎంఓ కార్యాలయం, ఆయనకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా గౌరవ సత్కారం చేయాలని నిర్ణయించడం, ఆయన శ్రమకు దక్కిన నిజమైన గుర్తింపు.

# దేశ జాతీయ ఐక్యత కోసం యువత పాటుపడాలి.

**శ్రీ రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి**










**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 31:** సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి జాతీయ ఏకతా దినోత్సవం సందర్భంగా కళాశాలలో శ్రీ స్వామి వివేకానంద ఆడిటోరియంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి రామకృష్ణ విద్యా సంస్థల అధినేత రామకృష్ణ రెడ్డి అధ్యక్షత వహించారు. ముందుగా రామకృష్ణారెడ్డి ప్రిన్సిపల్ కేబీవి సుబ్బయ్య నిమ్మకాయల సుధాకర్ నాగేశ్వరరావు అధ్యాపకులు తదితరులు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల పుష్పాలు సమర్పించి నివాళులర్పించారు.ముందుగా కళాశాల విద్యార్థిని విద్యార్థులు సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితము స్వాతంత్ర స్ఫూర్తి అంశాలపై చక్కగా మాట్లాడారు. విద్యార్థులు అబ్దుల్ రెహమాన్,పల్లవి, చైతన్య,విజయ్, సమీరా, సాయి మీనాక్షి, మదర్ భాష, వెంకటేష్, భవ్య శ్రీ ,వినయ్ కుమార్,కావ్య, శశిధర్, మూర్తి ఇంకా కొంతమంది విద్యార్థులు చక్కగా ప్రసంగించారు.దేశ సమైక్యతకు ప్రతీకగా నిలిచిన ఇనుప పురుషుడు ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియా సర్దార్ వల్లభభాయ్ పటేల్ జన్మదినం సందర్భంగా నంద్యాల శ్రీ రామకృష్ణ ఆటోనమస్ డిగ్రీ కళాశాలలో జాతీయ ఏకతా దినోత్సవం సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. "సర్దార్ పటేల్ 562 స్వతంత్ర సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి దేశ ఐక్యతకు పునాది వేశారు. ఆయన ఆత్మవిశ్వాసం, దృఢ సంకల్పం ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకం" అని పేర్కొన్నారు. సువిశాల భారతదేశాన్ని ఆవిష్కరించిన రాజకీయ దురంధరుడు శ్రీ సర్దార్ వల్లభాయ్ పటేల్. దాదాపు 562 సంస్థానాలను భారతదేశంలో విలీనం కావడానికి కృషిచేసిన మహానీయుడు. ఇలాంటి మహానుభావులు జీవిత చరిత్రలు విద్యార్థులు చదివినప్పుడు ఎంతో స్ఫూర్తి పొందుతారని తద్వారా మీరు కూడా గొప్ప నాయకులుగా గొప్ప నాయకత్వంతో ఎదగడానికి అవకాశం ఉంటుందని ఆ ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని. ఎంతోమంది స్టూడెంట్స్ చక్కగా మాట్లాడారని ఇలాంటి స్ఫూర్తి ప్రేరణ ముందు ముందు కూడా కొనసాగించాలని విద్యార్థులను రామకృష్ణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థి పట్టణ ప్రముఖులు నిమ్మకాయల సుధాకర్ పాల్గొని చక్కటి ప్రసంగాన్ని చేశారు. నిమ్మకాయల సుధాకర్ మాట్లాడుతూ భారతదేశంలో 60 శాతం యువత ఉన్నారని యువత బాగా చదువుకొని విదేశాలలో స్థిరపడకుండా దేశ సేవ కోసం పనిచేయాలని నరేంద్ర మోడీ ప్రధానిగా దేశం కోసం ఎంతో పాటు పడుతున్నారని మీరు కూడా బాధ్యతాయుతమైన పదవులలో ఎదుగుతూ దేశానికి సేవ చేయాలని అన్నారు. భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశముగా కాకుండా అభివృద్ధి చెందిన దేశముగా మనము చూడాలని సంకల్ప బలముతో ముందుకు వెళ్లాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

కళాశాల ప్రిన్సిపల్ శ్రీ కేబీవి సుబ్బయ్య మాట్లాడుతూ జాతీయ ఏకత దినోత్సవంగా జరుపుకుంటున్న ఈరోజు ఎంతో శుభదినం అని సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవిత చరిత్రను ప్రతి విద్యార్థి చదవాలని అన్నారు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని దేశ ఉప ప్రధానిగా హోం మంత్రిగా పనిచేసి ఎనలేని సేవలు అందించారని నిరాడంబరమైన జీవితాన్ని గడిపారని అన్నారు. అందువలన విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసినప్పుడు జాతీయ నాయకుల త్యాగాలు మీకు ప్రేరణ కావాలని అందుకు అందు కొరకు మీరు కృషి చేస్తారని చేయాలని అన్నారు.

దేశ ఐక్యత సమగ్రత మరియు భద్రత కోసం పాటుపడతామని విద్యార్థుల చేత ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో చింతా నాగేశ్వరరావు పట్టణ సోషల్ మీడియా కన్వీనర్,కళాశాల అధ్యాపకులు డాక్టర్ లలితా సరస్వతి, శ్రీమతి హిమబిందు, విజయ్ కాంత్, శేఖర్, బాలచంద్రుడు విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ గీతం ఆలాపనలతో కార్యక్రమము ముగిసింది.

### చిత్తూరు మేయర్ దంపతుల హత్య

# దోసులకు ఉరిశిక్ష విధిస్తూ కోర్టు సంచలన తీర్పు

చిత్తూరు,**అక్టోబర్ 31ఆంధ్ర ప్రగతి**

చిత్తూరు మేయర్ కఠారి అనురాధ, మోహన్ దంపతుల హత్య కేసులో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఐదుగురు దోషులకు ఉరిశిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది. సుమారు పదేళ్ల క్రితం 2015 నవంబరు 17న అప్పటి చిత్తూరు మేయర్ కఠారి అనురాధ, మోహన్ దంపతుల హత్య జరిగింది. నగర పాలక సంస్థ కార్యాలయంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ కేసులో ఐదుగురు నిందితుల ప్రమేయం ఉందని చిత్తూరులోని ఆరో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు ఇటీవల తీర్పు ఇచ్చారు. ఈ మేరకు న్యాయస్థానంశుక్రవారం వారికి ఉరిశిక్ష ఖరారు చేసింది. ఈ కేసులో తొలుత 23 మందిని నిందితులుగా పేర్కొన్నారు. కాసరం రమేష్(ఏ22) తనకు కేసుతో సంబంధం లేదని పిటిషన్ దాఖలు చేయగా అతడి పేరును తప్పిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు ఇచ్చింది. ఎస్.శ్రీనివాసాచారి(ఏ21) కేసు విచారణ సాగుతుండగానే మృతిచెందారు. దాంతో 21 మంది నిందితులుగా ఉన్నారు. ఇందులో మేయర్ భర్త మోహన్ మేనల్లుడు శ్రీరామ్ చంద్రశేఖర్ అలియాస్ చింటూ(ఏ1), గోవింద స్వామి శ్రీనివాసయ్య వెంకటాచలపతి అలియాస్ వెంకటేష్(ఏ2),



జయప్రకాష్‌రెడ్డి అలియాస్ జయారెడ్డి(ఏ3), మంజునాథ్ అలియాస్ మంజు(ఏ4), మునిరత్నం వెంకటేష్(ఏ5)లు దోషులుగా తేలారు. దీంతో వారికి ఉరిశిక్ష విధించింది. దోషుల్లో ఏ1గా ఉన్న చింటూ రూ.70లక్షల పరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. కఠారి అనురాధ, మోహన్ వారసులకు రూ.50లక్షలు, గాయపడిన వేలూరి సతీష్ కుమార్ నాయుడికి రూ.20లక్షలు చెల్లించాలని స్పష్టం చేసింది. టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్న కఠారి మోహన్‌కు చింటూ మేనల్లుడు. వారి మధ్య వ్యక్తిగత, ఆర్థిక, రాజకీయ విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో మేయర్‌గా ఉన్న అనురాధ, మేనమామ మోహన్‌ను అడ్డు తొలగించుకోవాలని చింటూ నిర్ణయించుకున్నాడు. 2015 నవంబరు 17న చింటూ, మరో నలుగురు బురఖాలు ధరించి తుపాకులు, కత్తులతో చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోకి ప్రవేశించారు. కఠారి అనురాధపై చింటూ, మరికొందరు తుపాకులతో కాల్పులు జరపగా ఆమె అక్కడే నేలకొరిగారు. పక్క గదిలో ఉన్న కఠారి మోహన్‌ను కత్తులతో నరికారు. కొన ఊపిరితో ఉన్న మోహన్ వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు మరణించారు. మేయర్ దంపతులను చంపే క్రమంలో అక్కడే ఉన్న వేలూరి సతీష్ కుమార్ నాయుడినీ చంపేందుకు మంజునాథ్(ఏ4) యత్నించడంతో అప్పట్లో హత్యాయత్నం కేసు కూడా నమోదు చేశారు. ఇందులోనూ నేరం రుజువైంది. హంతకులకు ఆయుధాలు సమకూర్చడం, ఆశ్రయం ఇవ్వడం, ధనసాయం చేశారని మిగిలిన 16 మందిపై పోలీసులు అభియోగం మోపగా విచారణలో రుజువు కాలేదు. దీంతో వారిని నిర్దోషులుగా పేర్కొన్నారు. పదేళ్లకు తీర్పు వచ్చిన ఈ కేసులో ఏకంగా 352 వాయిదాలు పడ్డాయి. 130 మంది సాక్షులను విచారించారు. ఏ3, ఏ4గా ఉన్న జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్.. అరెస్టు అయినప్పటి నుంచి జైలులోనే ఉన్నారు. ఉరిశిక్ష ఖరారైన నేపథ్యంలో దోషులకు వైద్య పరీక్షలు నిర్వహించి కడప జైలుకు తరలించనున్నారు.

### ఏపీలో పనిచేస్తున్న 58 మంది

# తెలంగాణ ఉద్యోగుల బదిలీ

**అక్టోబర్ 31ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో పనిచేస్తున్న 58 మంది తెలంగాణ ఉద్యోగులను వారి సొంత రాష్ట్రానికి పంపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ కానున్న వారిలో క్లాస్ 3, క్లాస్ 4 స్థాయి ఉద్యోగులు ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం విధించిన కొన్ని షరతులకు అంగీకరిస్తూ ఏపీ సర్కార్ ఈ బదిలీ ప్రక్రియకు ఆమోదం తెలిపింది. రాష్ట్ర విభజన సమయంలో ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియలో భాగంగా పలువురు తెలంగాణ ప్రాంత ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు. అయితే, వీరిలో 58 మంది ఉద్యోగులు తెలంగాణనే తమ ఆప్షన్‌గా ఎంచుకున్నారు. వీరిలో కొందరు సరైన అవగాహన లేకపోవడం వల్ల, మరికొందరు కారుణ్య నియామకాల కింద తెలంగాణకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. కానీ, వివిధ కారణాల వల్ల వీరు ఏపీలోనే ఉండిపోవాల్సి వచ్చింది.తమను కూడా సొంత రాష్ట్రానికి పంపించాలని వీరంతా చాలాకాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ అభ్యర్థనను పరిశీలించిన ప్రభుత్వం, తెలంగాణ సర్కార్‌తో సంప్రదింపులు జరిపింది. తెలంగాణ ప్రభుత్వం విధించిన కొన్ని నిబంధనలు, షరతులకు అంగీకారం తెలిపి, ఈ 58 మంది ఉద్యోగులను రిలీవ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం శుక్రవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.కాగా, గతంలోనూ రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించిన 698 మంది తెలంగాణ ఉద్యోగులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి సొంత రాష్ట్రానికి పంపిన విషయం తెలిసిందే. తాజా ఉత్తర్వులతో మిగిలిపోయిన 58 మంది ఉద్యోగులు కూడా త్వరలోనే తెలంగాణ ప్రభుత్వ సర్వీసులో చేరనున్నారు.

# కృష్ణానదిలో పెరుగుతున్న వరద ప్రవాహం

### ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు



విజయవాడ,**అక్టోబర్ 31ఆంధ్ర ప్రగతి**కృష్ణానదిలో వరద ప్రవాహం గంట గంటకు పెరుగుతోంది. ప్రకాశం బ్యారేజ్ వద్ద ప్రస్తుతం ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో రెండూ సమానంగా ఉండి భారీ నీటి ప్రవాహం కొనసాగుతోంది. తాజా వివరాల ప్రకారం, బ్యారేజ్ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో రెండూ 5,38,867 లక్షల క్యూసెక్కులుగా నమోదయ్యాయి. పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ, కృష్ణా నదిలో వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో పరీవాహక ప్రాంతాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. పొంగిపొర్లే వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదు. లోతట్టు ప్రాంత ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా గుంటూరు, కృష్ణా, నంద్యాల జిల్లాల్లో రోడ్డు రవాణా అంతరాయాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు వరద ప్రభావిత మండలాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, వచ్చే 24 గంటల్లో కూడా కృష్ణా పరివాహక ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరద పరిస్థితి కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రజలు అధికారుల సూచనలు పాటించి, అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ విభాగం విజ్ఞప్తి చేసింది.

### జీఎస్టీ ఎఫెక్ట్.. ఆరోగ్య బీమా వైపు

# పరుగులు పెడుతున్న జనం

అమరావతి,**అక్టోబర్ 31ఆంధ్ర ప్రగతి**

ఆరోగ్య బీమా పథకాలపై కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీని తొలగించడంతో ప్రజల్లో హెల్త్ ఇన్సూరెన్స్ పట్ల ఆసక్తి గణనీయంగా పెరిగింది. ఫలితంగా, కొత్తగా ఆరోగ్య బీమా పాలసీలు తీసుకునే వారి సంఖ్య ఏకంగా 38 శాతం మేర వృద్ధి చెందినట్లు ప్రముఖ ఆన్‌లైన్ ఇన్సూరెన్స్ సంస్థ పాలసీ బజార్ తన నివేదికలో వెల్లడించింది. జీఎస్టీ ఎత్తివేత సామాన్యులకు ఊరటనివ్వడమే కాకుండా, బీమా ప్రాముఖ్యతను కూడా పెంచిందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.నివేదిక ప్రకారం, పాలసీలు తీసుకునే వారి సంఖ్య పెరగడంతో పాటు, వారు ఎంచుకునే బీమా కవరేజీ మొత్తం కూడా భారీగా పెరిగింది. గతంలో సగటున రూ.13 లక్షల కవరేజీతో పాలసీలు తీసుకునేవారు, ఇప్పుడు దానిని రూ.18 లక్షలకు పెంచుకున్నారు. కొత్తగా బీమా తీసుకుంటున్న వారిలో దాదాపు 45 శాతం మంది రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల మధ్య కవరేజీ ఉన్న పాలసీలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. మరో 24 శాతం మంది రూ.10-15 లక్షల కవరేజీని, 18 శాతం మంది రూ.10 లక్షల లోపు కవరేజీని ఎంచుకుంటున్నారు. ఇప్పటికే ఆరోగ్య బీమా కలిగిన వారు కూడా జీఎస్టీ




తొలగింపు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. తమ పాత పాలసీలకు అదనపు సదుపాయాలను జోడించుకుంటూ కవరేజీని పెంచుకుంటున్నారు. ముఖ్యంగా, 61 ఏళ్లు పైబడిన వృద్ధుల్లో అధిక కవరేజీ ఉన్న పాలసీలపై ఆసక్తి 11.5 శాతం పెరిగింది.కేవలం నగరాల్లోనే కాకుండా, చిన్న పట్టణాల్లోనూ ఆరోగ్య బీమాపై అవగాహన, ఆసక్తి పెరుగుతున్నాయని పాలసీ బజార్ నివేదిక తెలిపింది. అక్కడ కూడా ప్రజలు అధిక మొత్తంలో కవరేజీ ఉన్న పాలసీలను తీసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. మొత్తంగా, దేశవ్యాప్తంగా ఆరోగ్య బీమాకు ఆదరణ పెరగడానికి కేంద్రం తీసుకున్న జీఎస్టీ మినహాయింపు నిర్ణయమే ప్రధాన కారణమని నివేదిక తేల్చిచెప్పింది.

# రియల్ టైమ్ మానిటరింగ్, రియల్ టైమ్ సొల్యూషన్

## : మొంథా తుఫాన్ పర్యవేక్షణలో హైఎండ్ టెక్నాలజీ వినియోగం

అమరావతి,**అక్టోబర్ 31ఆంధ్ర ప్రగతి**

ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు అపార అనుభవం ఉంది. తుఫాను హెచ్చరికలు జారీ అయినప్పటి నుంచి తుఫాను కదలికలను గమనించడం, ఆ మేరకు ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం, ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడటం వంటి అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఎల్లప్పుడూ పర్యవేక్షిస్తుంటారు. అయితే, మొంథా తుఫాను విషయంలో ఆయన కొంత విభిన్నంగా వ్యవహరించారు.

రాత్రింబవళ్లు పర్యవేక్షిస్తూనే సాంకేతికతను పూర్తి స్థాయిలో వినియోగించారు ముఖ్యమంత్రి చంద్రబాబు. ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి రియల్ టైమ్ డేటాను అప్డేట్ చేసుకుంటూ, వచ్చిన సమాచారాన్ని విశ్లేషించుకుంటూ, రియల్ టైంలోనే సమస్యలను పరిష్కరించేలా పని చేశారు. డేటా ఆధారిత విపత్తు నిర్వహణ నమూనాను ఆవిష్కరించారు. ఇంటిగ్రేటెడ్ ప్లానింగ్, టెక్నాలజీని అనుసంధానించి రియల్ టైమ్‌లో సమన్వయం చేసుకోవడం, నిర్ణయాలు తీసుకోవడం, అవి అమలు అయ్యేలా చూడటంలో ఈ నమూనా విజయం సాధించింది. సాంప్రదాయ పద్ధతులను అనుసరించడంతోపాటు వివిధ శాఖల నుంచి ఆర్టీజీఎస్ సెంటర్‌కు వచ్చిన సమాచారాన్ని అనుసంధానించి %ూాఔూ=జు% 2.0 వ్యవస్థ ద్వారా తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో సహాయక చర్యలు చేపట్టడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగింది ప్రభుత్వం.

సాంకేతికత ద్వారా మొంథా తుఫాను సహాయక చర్యలను ఏ విధంగా పర్యవేక్షించారనే వివరాలను ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ మీడియాకు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తుఫాన్ హెచ్చరికలు జారీ అయినప్పటి నుంచి తొమ్మిదిసార్లు టెలీ కాన్ఫరెన్సులు, ఆర్టీజీ సెంటర్ నుంచి నిరంతరం సమీక్షా సమావేశాలు నిర్వహించారు. అలాగే వివిధ విభాగాలు, క్షేత్ర స్థాయి అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. ఆర్టీజీఎస్ కంట్రోల్ రూమ్ నుంచి వచ్చిన



సమాచారంతో, అవసరమైన ప్రాంతాలకు సహాయక చర్యలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేసేలా ప్రభుత్వం సాంకేతికతను పూర్తి స్థాయిలో వినియోగించింది. అవసరమైన చోట యంత్ర పరికరాలను, మానవ వనరులను సమర్థంగా కేటాయించడంలోనూ సాంకేతికత సహాయపడింది.

### టెక్నాలజీ వనరుగా - AWARE 2.0

AWARE 2.0 వ్యవస్థకు స్టేట్ డేటాలేక్ ద్వారా అన్ని విభాగాలను అనుసంధానం చేశారు. దీని ద్వారా రియల్ టైములో నిర్ణయాలు తీసుకోవడానికి వీలు ఉంటుంది. వర్షపాతం, గాలి, పిడుగుల వంటి వాటిపై హెచ్చరికలు జారీ చేసేలా అవేర్-2.0 వ్యవస్థ పని చేస్తుంది. ఈ వ్యవస్థ ద్వారా విపత్తు నిర్వహణను సమర్థవంతంగా చేపట్టవచ్చు. అలాగే రిజర్వాయర్ స్థాయిలు, ఇన్‌ఫ్లోలు, భూగర్భ జలాలు చెరువులకు సంబంధించిన రియల్ టైమ్ డేటా అందుబాటులో ఉంటుంది. దీంతో శాటిలైట్ ద్వారా వివిధ ప్రమాదాలకు సంబంధించిన హెచ్చరికలు జారీ చేసే అవకాశముంది. అవేర్-2.0 వ్యవస్థ ద్వారా వచ్చే సమాచారాన్ని క్రోడీకరించుకుని కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా విశ్లేషించి మొంథా తుఫాన్ కదలికలను కచ్చితంగా తెలుసుకోగలిగింది రాష్ట్ర ప్రభుత్వం. తద్వారా సహాయక చర్యలనూ వేగంగా చేపట్టింది.

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్న వ్యవస్థ ద్వారా 72 గంటల ముందే తుఫాన్ కదలికల్లో వచ్చిన మార్పులను గుర్తించగలిగారు. దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోగలిగారు, అలాగే ఆయా ప్రాంతాల్లోని ప్రజలనూ అప్రమత్తం చేయగలిగారు. గాలుల వేగాన్ని అంచనా వేయడంలో కచ్చితమైన సమాచారం రావడంతో ఆయా ప్రాంతాల్లో ముందస్తుగానే చర్యలు తీసుకోవడానికి అవకాశం లభించింది. దీని ద్వారా ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగింది ప్రభుత్వం.

### అలారంలా పని చేసిన అలెర్ట్ మెకానిజం

ఇక వివిధ వ్యవస్థల ద్వారా రియల్ టైములో సేకరించిన సమాచారాన్ని విశ్లేషించడం, ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో పాటు ప్రజలకు కచ్చితమైన సమాచారాన్ని అందించాలి. విపత్తులకు సంబంధించిన సమాచారం ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి. ఈ విషయంలో ప్రభుత్వం సాంకేతికతను పూర్తిగా వినియోగించుకుంది. వాస్తవాలను ప్రజలకు నేరుగా చేరవేయగలిగింది.

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు, అధికారులకు 1.1 కోట్లకు పైగా సందేశాలను ప్రభుత్వం పంపింది. ఫిర్యాదులు స్వీకరించడం, అభిప్రాయాలు తీసుకోవడానికి కూడా ప్రత్యేక వ్యవస్థలు పని చేశాయి. మనమిత్ర ద్వారా సుమారు 12,000కు పైగా ఫిర్యాదులు అందాయి. వీటిని క్షేత్రస్థాయిలో ఉన్న ప్రభుత్వ యంత్రాంగం పరిష్కరించింది. ఐవీఆర్ఎస్ సర్వేలు, మీడియా, సామాజిక మాధ్యమ సమీక్షల ద్వారా అధికారుల నుంచి సమాచారం తీసుకున్నారు. ఇదే సమయంలో తప్పుడు సమాచారం వ్యాప్తిని నివారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

### డ్రోన్‌లు, సీసీటీవీ, వాహనాల లైవ్ ట్రాకింగ్

ఏరియల్ సర్వేలు, వరద మ్యాపింగ్, రియల్ టైమ్ డేటా సేకరణ కోసం 602 డ్రోన్‌లను అందుబాటులో ఉంచారు. 14,770 సీసీటీవీ కెమెరాలను ఆర్టీజీఎస్ నెట్‌వర్క్‌కు అనుసంధానించారు. 24 గంటల పాటు క్షేత్ర స్థాయిలో ఉన్న పరిస్థితులను అంచనా వేయగలిగారు. అలాగే ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని త్వరగా గుర్తించగలిగారు. ఇక మెషినరీ ట్రాకింగ్ యాప్ ద్వారా జేసీబీలు, క్రేన్‌లను లైవ్ ట్రాక్ చేయడానికి వీలు కలిగింది.

అలాగే రోడ్‌బ్లాక్‌లు, వరద ప్రభావిత ప్రాంతాల్లో సమస్యలు ఉన్న చోట జేసీబీలు, క్రేన్లను తరలించేలా చర్యలు తీసుకోగలిగారు. ఇక అన్ని విభాగాల నుంచి వచ్చిన లైవ్ డేటాను అనుసంధానిస్తూ... తుఫాను పర్యవేక్షణ డాష్‌బోర్డు ఏర్పాటు చేశారు. ఇంటిగ్రేటెడ్ జీఐఎస్ మ్యాపింగ్ ద్వారా రోడ్లు, ఆసుపత్రులు, సహాయక కేంద్రాలు, కీలకమైన మౌలిక సదుపాయాలు ఎక్కడున్నాయనే సమాచారాన్ని సేకరించగలిగారు.

### గ్రౌండ్ నెట్ వర్క్... గ్రౌండ్ రియాల్టీ...

5,803 గ్రామ, వార్డు స్థాయిలో కూడా కమాండ్ సెంటర్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసుకోగలిగింది. క్షేత్ర స్థాయి సిబ్బంది ద్వారా 2 కోట్లకు పైగా ప్రజలకు సేవలందించే ఏర్పాట్లను ముందుగానే చేసుకోగలిగింది. ఈ క్షేత్ర స్థాయి వ్యవస్థ ద్వారా బ్యాకప్ పవర్, సహాయక సామాగ్రిని ఆయా కేంద్రాల్లో ముందుగానే ఉంచారు. ముఖ్యంగా 1,742 మంది గర్భిణిలను సురక్షితంగా ఆసుపత్రులకు తరలించడంలో గ్రౌండ్ లెవల్ నెట్ వర్క్ బాగా ఉపయోగపడింది. తుఫాను సమయంలో అన్ని సంస్థల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేస్తూ, ఒక బలమైన సమాచార వ్యవస్థ కొనసాగింది. 2,973 పోర్టబుల్ వైర్‌లెస్ సెట్‌లు, డీజీ సెట్‌లు, వాహనాలకు అమర్చిన రేడియోలతో ఆర్టీజీ సెంటర్ నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఉంది.

### కేంద్ర ఏజెన్సీలతో సమన్వయం

కేంద్ర సంస్థలతో సమన్వయం ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, ఐఎండీ, ఎన్డీఎంఏ, ఎంహెచ్ఏలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఆర్టీజీఎస్ సహా ఇతర విభాగాలు పని చేశాయి. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నెల్లూరులోని సంగం బ్యారేజ్ సమీపంలో చిక్కుకున్న పడవను చాకచక్యంగా లాగడం వంటి క్లిష్టమైన రెస్క్యూ మిషన్లను చేపట్టాయి. భారతదేశంలో మొట్టమొదటిదైన ఎన్డీఎంఏ సెల్ బ్రాడ్‌కాస్ట్ వైబ్రేషనల్ అలర్ట్ సేవను మన రాష్ట్రం వినియోగించుకుంది. విద్యుత్ శాఖ ఫీడర్‌లు, సబ్‌స్టేషన్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేశారు. ఉపగ్రహ చిత్రాల సహాయంతో ముంపు నివారణకు చర్యలు తీసుకున్నారు. ఈ విధంగా పూర్తి స్థాయి సాంకేతికతతో ప్రభుత్వం మొంథా తుఫాను సహాయక చర్యలను చేపట్టింది. భవిష్యత్తులో ఎలాంటి ప్రకృతి విపత్తులు సంభవించినా ప్రస్తుతం ఏర్పాటు చేసుకున్న వ్యవస్థల ద్వారా నష్ట నివారణా చర్యలు చేప్టటడానికి ఒక ప్రణాళిక సిద్ధమైంది.

# సీఎం రేవంత్ రెడ్డితో బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ భేటీ



బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. గురువారం సాయంత్రం ముంబైలో వీరి భేటీ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి సందేశాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేస్తానని సల్మాన్ ఖాన్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో వీరిద్దరి మధ్య జరిగిన చర్చల పూర్తి వివరాలు బయటకు రానప్పటికీ, తెలంగాణ ప్రతిష్ఠను ప్రపంచ స్థాయిలో ఇనుమడింపజేసే అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశంలో సల్మాన్ ఖాన్ మాట్లాడుతూ.. (తెలంగాణ రైజింగ్) అనే సందేశాన్ని ప్రపంచ నలుమూలలకూ తీసుకెళ్తానని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు, తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడానికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో సినీ ప్రముఖులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం కావడం ఇది రెండోసారి. గత జులై నెలలో ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్ కూడా ముఖ్యమంత్రిని కలిసి, రాష్ట్ర ప్రభుత్వ జ్యూరీ అవార్డు ప్రకటించినందుకు వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పుడు సల్మాన్ ఖాన్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖుల ద్వారా తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించడం, రాష్ట్ర ప్రతిష్ఠను పెంచడంలో భాగంగానే ఈ సమావేశాలు జరుగుతున్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# సక్సెస్ అయితే సీనియర్లకు మంచి ఆప్షనే!



సీనియర్ హీరోలకు హీరోయిన్లు ఎంపిక అన్నది ఎంత కష్టంగా మారుతుందో చెప్పాల్సిన పనిలేదు. చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ, వెంకటేష్ లాంటి స్టార్లకు హీరోయిన్లు సెట్ చేయడం ప్రతీసారి సమస్యగా మారుతోంది. దీంతో తీసుకున్న వారినే మళ్లీ మళ్లీ తీసుకోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో నయనతార, త్రిషలనే రిపీట్ చేయాల్సిన సన్నివేశం ప్రతీసారి కనిపిస్తోంది. అనుష్క లాంటి 40 ఏళ్లు దాటి నటి ఉన్నా? దర్శకులు ఎందుకనో ఆమెవైపు చూడటం లేదు. మిల్కీ బ్యూటీ తమన్నా కూడా సీరియర్లకు సై అంటున్నా? ఆమెని కూడా అశ్రద్ధ చేస్తున్నారు. కన్నడిగి మరో ఆప్షన్ గా: తప్పదు అనుకుంటే? తప్ప మిల్కీ వైపు ఎవరూ వెళ్లడం లేదు. ఆమెను ఓ ఐటం భామగానే పరిమితం చేస్తున్నారు. ఆషికా రంగనాథ్, సంయుక్తా మీనన్ లాంటి వారు మరిన్ని సక్సస్ లు అందుకుంటే? సీనియర్లకు సరితూగుతారు. ప్రస్తుతం ఈ భామలు సీనియర్లతో కొన్ని సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వాళ్ల సరసన చేరడా నికి కన్నడిగి శ్రీనిధి శెట్టి కూడా సిద్ధంగా ఉంది. విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలో శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా ఎంపికైన సంగతి తెలిసిందే. ఏరికోరి మరీ ఎంపిక చేసారు: గురూజీ చాలా మంది భామల్ని పరిశీలించి చివరిగా ఆ ఛాన్స్ శెట్టి బ్యూటీకి ఇచ్చారు. ఈ బ్యూటీ తెలుగింట ఇప్పుడి ప్పుడే ఫేమస్ అవుతుంది. ఇటీవల రిలీజ్ అయిన %-%హిట్ 3%-% తో మంచి హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. ఈ అమ్మడు కూడా అందాల ఆరబోత కంటే నటనకు ఆస్కారం ఉన్న పాత్రలే చేస్తుంది. గురూజీ సినిమాల్లో హీరోయిన్ల పాత్రలకు పెద్ద పీట వేస్తారు. హీరోకు ధీటుగా హీరోయిన్ పాత్రలను డిజైన్ చేస్తారు. శ్రీనిధి పెర్ఫార్మర్ కావడంతో ఏరికోరి మరీ ఎంపిక చేసారు. ఆయన చేతుల్లో పడ్డ హీరోయిన్లు కూడా వెలుగులోకి వచ్చారు. గ్లామర్ పాత్రలకు నో: ఈ సినిమా హిట్ అయితే గనుక శ్రీనిధికి మంచి పేరు వస్తుంది. అవకాశాలు పెరుగుతాయి. యువ హీరోలతో పాటు, సీనియర్ హీరోలకు శ్రీనిధి మంచి ఆప్షన్ గా మారుతుంది. కెరీర్ పరంగా శ్రీనిధి గురూజీ ఇచ్చిన అవకాశాన్ని గొప్పగా భావిస్తోంది. ఇతర భాషల్లో కొన్ని చిత్రాల్లో గ్లామర్ పాత్రల్లో నటించాలని చాలా అవకాశాలు వచ్చినా? శ్రీనిధి వాటిని సున్నితంగా తిరస్కరించింది. ప్రస్తుతం తెలుగు సినిమాలపై దృష్టి పెట్టి పని చేస్తోంది.

# డాడ్ ఫ్రెండ్ ప్రోత్సాహంతో హీరోయిన్ గా!



మాలీవుడ్ బ్యూటీ మమితా బైజు టాలీవుడ్ లో సినిమాలు చేయకముందే యువతలో ఫాలోయింగ్ సంపాదించిన బ్యూటీ. మాలీవుడ్ అనువాద చిత్రం %-%ప్రేమలు%-%తోనే బోలెడంత ఫేమస్ అయిపోయింది. అప్పటి నుంచి అమ్మడికి యువతలో మంచి క్రేజ్ ఏర్పడింది. ఇటీవల రిలీజ్ అయిన డ్యూడ్ తోనూ మరో బ్లాక్ బస్టర్ అందుకుంది. ఇందులో అమ్మడు ప్రదీప్ రంగనాథ్ కు జోడీగా నటించి మెప్పించింది. ఈ సినిమా ఇప్పటికే 100 కోట్ల క్లబ్ లో చేరింది. తమిళ సినిమా అయినా తెలుగు ప్రేక్షకులకు బ్రహ్మరథం పట్టడంతో ఇంత పెద్ద విజయం సాధ్యమైంది. డాక్టర్ కాబోయి యాక్టర్: దీంతో మమిత పేరు మరోసారి నెట్టింట ట్రెండింగ్ లో నిలిచింది. ఇక తెలుగు లో అవకాశాలు రావడం పెద్ద విషయం కాదు. ఇప్పటికే కొన్ని అవకాశాలు కూడా వచ్చినా రిజెక్ట్ చేసింది. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు మాత్రమే పోషించాలి అనే కండీషన్ తో పని చేస్తుంది. ఈ నేపథ్యంలో గ్లామర్ పాత్రల్లో నటించే అవకాశాలను మమిత రిజెక్ట్ చేసినట్లు ప్రచారంలో ఉంది. అయితే ఈ బ్యూటీ గురించి తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. మమితా బైజు తండ్రి డాక్టర్. సొంతంగా ఓ క్లినిక్ కూడా ఉంది. %ూశ్రీంశీ =ఝ%ం - విశాల్ సినిమాకు డైరెక్టర్స్ అసోసియేషన్ చెక్..! బేబి డాక్టర్ గా ఫేమస్: మమిత క్లినిక్ కి వెళ్లిన సమయంలో బేబి డాక్టర్ అని పిలిచేవారట. రోగం నయం అయిన తర్వాత పేషెంట్లు తండ్రికి కృతజ్ఞతలు చెప్పడానికి వచ్చిన వారిని చూసి ఓ కుమార్తెగా తానెంతో గర్వపడేదాన్ని అన్నారు. ఆ కారణంతో తాను కూడా తండ్రిలా డాక్టర్ అవ్వాలని కలలు కనేదట. కానీ అనుకోకుండా సినిమాల్లోకి రావడంతో ఆ కల చెదిరి పోయిందదంది. 9వ తరగతి చదువుకుంటోన్న సమయంలో సర్వోపరి బాలక్కాన్ సినిమాలో నటించే అవకాశం వచ్చిందిట. ఆ చిత్రాన్ని నిర్మించేది కూడా తండ్రి స్నేహితుడు కావడంతో అవకాశం ఈజీగా వచ్చిందదంది. నటిగా అమ్మడి ప్రయాణమలా: ఆ సినిమా తర్వాత ఆడిషన్ కు వెళ్లమని ప్రోత్సహించేవారుట. అలా వెళ్లడం సహా తొలి సినిమా రిలీజ్ అనంతరం చాలా అవకాశాలు వచ్చాయంది. అలా నెమ్మదిగా నటన అలవాటుగా మారిందదంది. నటనంటే చిరాకు పడే మమితా నటనపై ఇష్టం పెంచుకున్నట్లు తెలిపింది. కాలక్రమంలో మ్యాకప్ అలవాటు గా మారడంతో ఇంట్లో ఉన్న సమ యంలో కూడా అప్పుడప్పుడు మ్యాకప్ వేసుకునేదట. అప్పటి నుంచి నటిగా స్థిరపడాలి అనే ఆలోచనతోనే ప్రయాణం మొదలు పెట్టినట్లు తెలిపింది. ఈ బ్యూటీ ఇప్పటి వరకూ మాలీవుడ్ లోనే ఎక్కువ సినిమాలు చేసింది. తమిళ్ లో రెండు..మూడు సినిమాలు చేసింది. ప్రస్తుతం దళపతి విజయ్ హీరోగా నటిస్తోన్న జన నాయగన్ లోనూ నటిస్తోంది.

# హత్య చేసినా ఓకే.. కానీ అబద్ధం చెబితే ఊరుకోను: తమన్నా



ప్రముఖ నటి తమన్నా తన వ్యక్తిగత సంబంధాలు, భాగస్వామిలో ఉండాల్సిన లక్షణాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒక బంధంలో తాను ఏ విషయాన్ని అస్సలు సహించలేదో స్పష్టం చేశారు. అబద్ధం చెప్పడం తనకు ఏమాత్రం నచ్చదని, దాన్ని తట్టుకోలేనని కుండబద్దలు కొట్టారు. ఇటీవల 'యువా'కు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తమన్నా మాట్లాడుతూ, "నాకు అబద్ధాలు చెప్పేవాళ్లను చూస్తే అస్సలు సహించలేను. ఏదైనా తప్పు జరిగినా, సమస్య వచ్చినా దాన్ని పరిష్కరించడానికి నేను సిద్ధంగా ఉంటాను. అవసరమైతే మీరు ఒక హత్య చేసినా దాన్ని కప్పిపుచ్చడానికి నేను సాయం చేస్తానేమో (నవ్వుతూ). కానీ, అబద్ధాలు చెప్పే వారిని మాత్రం నేను భరించలేను" అని అన్నారు. ఆమె ఇంకా వివరిస్తూ, "నా ముఖం మీదే అబద్ధం చెప్పి, దాన్ని నేను నమ్మేంత మూరు?రాలిని అని అవతలి వారు అనుకున్నప్పుడు నాకు చాలా కోపం వస్తుంది. సమస్య కేవలం అబద్ధం చెప్పడం కాదు, అవతలి వారు మనల్ని అంత తెలివితక్కువ వారని భావించడమే అసలు సమస్య" అని తమన్నా తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పారు. గతంలో తమన్నా, నటుడు విజయ్ వర్మతో ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. 2023లో 'లస్ట్ స్టోరీస్ 2' వెబ్ సిరీస్ ప్రమోషన్ల సమయంలో వీరిద్దరూ తమ సంబంధాన్ని అధికారికంగా ప్రకటించారు. తరచూ పలు కార్యక్రమాలకు, పార్టీలకు కలిసి హాజరయ్యారు. అయితే, ఇటీవలే వీరిద్దరూ విడిపోయినట్లు వార్తలు వచ్చాయి. గతంలో ఓ ఇంటర్వ్యూలో కూడా తమన్నా మాట్లాడుతూ, తాను ఒక గొప్ప జీవిత భాగస్వామిగా మారేందుకు ప్రయత్నిస్తున్నానని పేర్కొన్నారు. "ఎవరి జీవితంలోకి నేను వెళ్లినా, వారు గత జన్మలో ఏదో పుణ్యం చేసుకున్నందుకే నేను దొరికానని భావించాలి. ఆ అదృష్టవంతుడి కోసం నేను నన్ను నేను తీర్చిదిద్దుకుంటున్నాను" అని ఆమె చెప్పడం గమనార్హం. తాజా వ్యాఖ్యలతో బంధంలో నిజాయతీకి ఆమె ఎంత విలువిస్తారో స్పష్టమవుతోంది.

# ట్రంప్ ట్వీట్ ని పబ్లిసిటీకి వాడిన అడివి శేష్..!



కాదేది కవితకు అనర్హం అని అన్నట్టుగా కాదేది సినిమా పబ్లిసిటీకి అనర్హం అని మన తెలుగు యాక్టర్స్ చెబుతున్నారు. వాళ్ల వాడకం ఎలా ఉంది అంటే ఏకంగా సినిమా ప్రమోషన్ కోసం అమెరికా ప్రెసిడెంట్ ని కూడా వాడుతున్నారు. సినిమాను జనాల్లోకి తీసుకెళ్లడం కోసం ఎలాంటి ప్లాట్ ఫాం ని వదలట్లేదు యాక్టర్స్. ఇంతకీ విషయం ఏంటంటే టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్ లేటెస్ట్ గా అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ట్వీట్ ని తన సినిమా ప్రమోషన్స్ కి వాడుకున్నాడు. ట్రంప్ త్వరలో జీ 2 కన్విసింగ్ ఉంటుందని ఎక్స్ లో పెట్టగా దానికి అడివి శేష్.. జీ 2 మాసివ్ ముందు డెకాయిట్ ఎక్స్ ప్లోషన్ ఉందని రిప్లై ఇచ్చాడు. అడివి శేష్ ఇచ్చిన రిప్లై ట్రంప్ చూసే ఛాన్స్ ఉండకపోవచ్చు కానీ జీ 2 అని ట్రంప్ పెట్టింది అది గూఢచారి 2 అన్నట్టు తను ఫీలి ఇలా డెకాయిట్, జీ 2ల ప్రమోషన్ ని ట్రంప్ ట్వీట్ ద్వాకా వాడటం అది కేవలం అడివి శేష్ వల్లే అయ్యింది. అడివి శేష్ ప్రస్తుతం రెండు సినిమాలు చేస్తున్నాడు. అందులో ఒకటి డెకాయిట్ కాగా.. మరొకటి జీ2 అదే గూఢచారి 2. డెకాయిట్ ఒక లవ్ స్టోరీ విత్ యాక్షన్ ఎంటర్టైనర్ గా రాబోతుంది. ఈ సినిమాను షానీల్ డియో డైరెక్ట్ చేస్తున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమా అసలైతే డిసెంబర్ 25 క్రిస్మస్ కి రిలీజ్ అనుకున్నారు కానీ ఇప్పుడు ఆ సినిమాను మార్చి 19కి రిలీజ్ వాయిదా వేశారు.

ఇక అడివి శేష్ అండ్ టీం గూఢచారి సీక్వెల్ గా %+%2 కోసం రెండేళ్లుగా షూటింగ్ చేస్తూనే ఉన్నారు. తెలుగు తెర మీద పర్ఫెక్ట్ రా ఏజెంట్ మూవీని చూపించేలా వారి ప్రయత్నాలు జరుగుతున్నాయి. జీ 2 సినిమాలో వామిక గబ్బి హీరోయిన్ గా నటిస్తుంది. ఈ రెండు సినిమాలు కూడా నెక్స్ట్ ఇయర్ రిలీజ్ కాబోతున్నాయి. అడివి శేష్ సినిమాలు ఆడియన్స్ ని ఇంప్రెస్ చేస్తాయి. కానీ సినిమా సినిమాకు అతను తీసుకునే టైం ఆడియన్స్ కి ఇబ్బంది కలిగిస్తుంది. ఐతే టైం తీసుకున్నా సరే మంచి అవుట్ పుట్ తో ఆడియన్స్ ని మెప్పించాలని ప్రయత్నిస్తాడు అడివి శేష్. మరి డెకాయిట్, జీ 2 ఈ రెండు సినిమాలతో అడివి శేష్ ఎలాంటి రిజల్ట్ అందుకుంటాడో చూడాలి.

ఈమధ్య సినిమా తీయడం కన్నా ఆ సినిమా గురించి ఆడియన్స్ లో డిస్కషన్ ఉండేలా చేయడం పెద్ద పనిగా మారింది. అందుకే మేకర్స్ సినిమా తీయడమే కాదు ప్రమోషన్స్ విషయంలో కూడా సీరియస్ ప్లానింగ్ తో వస్తున్నారు. ఎలా అయితే అడివి శేష్ ట్రంప్ ట్వీట్ కి సంబంధం లేకపోయినా కామెంట్ పెట్టాడో అలా సినిమాకు రిలేటెడ్ అయినా కాకపోయినా సందర్భాన్ని వాడుకోవాలని ఫిక్స్ అయ్యారు.